# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము
డి.జె. బాలకృష్ణ లాల్
డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 36 సంచిక 4
పేజీలు 40
డిసెంబర్ 2016

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

భద్రవాక్యం ........................................2
శ్రీబాబూజీ ఉవాచ........................................3
అమ్మమాట........................................6
అంతఃకరణ చతుష్టయం........................................8
సచామర రమావాణీ సవ్యదక్షిణ సేవితా .........10
విభీషణుని ధర్మదీక్ష ........................................11
మానవుని శరీరమే పరమాత్ముని మందిరం ........12
సీతాదేవి ........................................13
ఆలోచనలను అరికట్టు - వర్తమానంలో జీవించు........................................15
దేవుడెక్కడ ఉన్నాడు? ........................................17
నిర్మల హృదయం ........................................18
ప్రవీరుని భక్తి ........................................20
యోగవాశిష్ఠము ........................................22
ఉషస్తి ........................................24
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు........................................27
పరిప్రశ్న ........................................28
అర్జునుని కృష్ణ ప్రేమ ........................................30
అనింద్యునిపై గణపతి విజయం ..............31
శ్రీకృష్ణకర్ణామృతము........................................33
వశిష్ఠుడు........................................35
సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర.....37
విష్ణు కథలు- సూరదాస్ ........................................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః। సన్న్యాసయోగాద్యతయః శుద్ధతత్త్వాః
తే బ్రహ్మలోకేషు పరాన్తకాలే। పరామృతాత్ పరిముచ్యన్తి సర్వే ॥
(కైవల్యోపనిషత్ 4శ్లో॥)

విక్షేపాదులతో కూడిన మనస్సు మలిన మనస్సుగా భావింపబడుతుంది. ఆధ్యాత్మిక భావాలను గ్రహించి, విచారణ చేయాలంటే, విక్షేప రహితమైన, స్థిరమైన మనస్సు తప్పనిసరి. దానిని సాధించటానికి ఉపాసన మార్గమే శరణ్యము. మనస్సు ఎటువంటి విషయములపై ఆసక్తి కలిగి ఉంటుందో అటువైపే పరుగిడుతుంది. మనస్సుని విషయాసక్తి నుండి మరల్చటమే సన్న్యాసము. మనోవృత్తే సంక్షోభాలకు, కలతలకు కారణము. విషయ వాంఛలను వదిలిపెడితే మానసిక శాంతి తథ్యము. కాని మనస్సుని విషయ లాలసత నుండి మరల్చుట సాధ్యమా?

విక్షేపములను కలిగించే విషయాదుల నుండి మనస్సును మరల్చాలంటే దానికి వేరొక లక్ష్యాన్ని అందించాలి. ఆ ప్రక్రియనే యోగంగా భావించాలి. ఆ యోగాన్ని ప్రసాదించగల సమర్థుడు గురుదేవుడు. విషయాసక్తమైన మనస్సును పరమాత్మ భావనలో ఐక్యంచేసి, దాని దిశను మార్చే ప్రక్రియనే సన్న్యాసయోగముగా భావింపబడుతోంది. నీచ ప్రవృత్తి నుండి విముక్తి చెందిన మనస్సు, పరిశుద్ధమై, వేదాంత విజ్ఞానము అంటే ఆత్మానుభూతిని పొందే అర్హతని సంపాదించ గలుగుతుంది. ఆత్మసాక్షాత్కారాన్ని యీ లోకంలో దేహం ఉండగానే పొందే వీలున్నది. అదే జీవన్ముక్తి.

అలా సాధ్యంకాని పక్షంలో సాధకుడు దేహత్యాగం చేసిన తరువాత బ్రహ్మలోకము చేరి, గురుబ్రహ్మ పర్యవేక్షణలో తగిన శిక్షణచేత ఆత్మసాక్షాత్కారము పొందటం తథ్యం. దానిని క్రమముక్తి లేక విదేహముక్తిగా భావించవచ్చునని పై శ్లోకం తెలియజేస్తోంది.

ఈ శ్లోకములో బ్రహ్మలోకే, పరాన్తకాలే అనే పదాలను ఆధ్యాత్మిక దృక్పథంతో విచారణచేస్తే జీవభావము నశించిన వెంటనే బ్రహ్మానుభూతి పొందగల్గుతారని తెలియజేస్తున్నట్లుగా అర్థం అవుతోంది.

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ తిరుమలలో భక్తులకు బోధచేస్తూ "భగవానుడు మీకు ప్రసాదించిన శక్తిని సక్రమంగా, ధర్మంగా, న్యాయంగా వినియోగించి కర్మని ఆచరించే వారికి ఉత్తమగతి ప్రాప్తిస్తుంది. దీనికోసం ఇంక ఏ రకమైన సాధన చేయనవసరంలేదు. మీరు డాక్టర్లు అయినా, ఇంజనీర్లు అయినా, లెక్చరర్లు అయినా లేక మరి ఏ ఇతర విద్యలో ప్రావీణ్యం కలిగి వున్నా మీ వృత్తి ధర్మాన్ని ధర్మమార్గంలో నిర్వర్తిస్తే మీరంతా కర్మయోగులే. అటువంటి కర్మయోగులను భగవానుడు అనుగ్రహించి, సత్యగురువు సన్నిధికి చేర్చి, మీ జీవిత గమ్యస్థానమేమిటో తెలుసుకునే మార్గాన్ని సుగమం చేస్తాడు. అందులో సందేహం లేదు. సుకృత కర్మను ఆచరించే కర్మయోగులంతా మోక్షాన్ని పొందేమార్గాన్ని పొందలేరు. కానీ, ఉత్తమ గతిని పొందుతారు. అంతేకాదు మోక్షాన్ని పొందేమార్గానికి చేరువలో ఉంటారు. ఇది మాత్రం సత్యం. మోక్షం అనేది కొత్తగా పొందేదికాదు. మీరంతా ఆ స్థితిలోనే ఉన్నారు. అయితే దానిని గుర్తించే స్థితిలో లేరు. ఆ స్థితిని గుర్తింపచేసే వారే సత్యగురువు. సుకృతకర్మను ఆచరించినా, భగవంతుని సేవగా ఏ కర్మ ఆచరించినా ఉత్తమగతి ప్రాప్తిస్తుంది కానీ జన్మరాహిత్యం సాధ్యపడదు. జన్మరాహిత్యం సంప్రాప్తించాలంటే సమర్థులైన గురుమూర్తిని ఆశ్రయించి ఆయన అనుగ్రహానికి పాత్రుడవై ఆయన ప్రసాదించిన లక్ష్యార్థమును నియమము తప్పకుండా, మరువకుండా ధ్యానించాలి.



అంతేకాదు ఆయన నిర్దేశించిన ఏ సేవ చేసినా అంతకు మించిన సాధన లేదు. అది జన్మరాహిత్యాన్ని ప్రసాదిస్తుంది. సాధకులు అసత్యమాడినా సోమరితనంతో సాధన కుంటుపడినా దేహాభిమానము పొడచూపినా సత్యగురువు ఎంతో ఆప్యాయతతో, కరుణతో శిష్యులను పైకి తీసుకురావడానికి చేసే ప్రయత్నంలో భాగంగా వారిని

మందలించవచ్చు. "శిష్యులు ఎలా ఉన్నత స్థితికి ఎదుగుతారా! ఎలా వుద్ధరింప బడతారా! అయ్యో! సాధన కుంటుపడుతోందే! అని ఎంతో ఆవేదన చెందుతారు.

సత్యగురువులకు దేహభావనగానీ, దేహదృష్టిగానీ ఉండదు. కాబట్టి శిష్యుల నిమిత్తం ఆవేదన చెందినప్పుడు అనారోగ్యానికి గురి కావచ్చు. సత్యగురువు ఎన్నడూ శిష్యులతో సేవ చేయించుకొనరు. పాదసేవను అంగీకరించరు. వారు ధనాన్ని ఎన్నడూ ఆశించరు. ధనాన్ని సంగ్రహించే విత్తాపహారకులు వేరే ఉంటారు. సత్యగురువు శిష్యులను ఒరేయ్! అనో, ఏమయ్యా! అనో సంబోధిస్తే అది అప్యాయతను సూచిస్తుంది. అది మీకు గురువుతో ఉన్న సన్నిహితత్వము తెలియచేస్తుంది. శిష్యుణ్ణి ఏమండీ! అని సంభోదిస్తే గురుమూర్తికి శిష్యుడు దూరంగా ఉన్నట్లే సుమా! ఆ దూరానికి కారణం త్రిగుణాలే కావచ్చు. లేక షడ్భావ వికారములు అవ్వచ్చు. లేదా కామక్రోధాది గుణాలు గానీ, అహంకార మమకారాలు గానీ ఉండవచ్చు. అది సాధకుని మనస్సుకీ, గురుదేవునికీ మినహా మిగిలినవారికి తెలియదు. శిష్యుడు ఎంతో వినయవిధేయతలతో వంగి వంగి సలాములు చేస్తూ గొప్ప సాధకునివలె ప్రవర్తించవచ్చు. తామరాకు మీద నీటిబొట్టులాగా ముత్యము వలె ప్రకాశించవచ్చు. మేడిపండు సామెత మీకందరికీ తెలిసినదేగా! భగవంతుని ప్రేమను పొందటానికి మీ ధనాన్ని ఎంత ఇచ్చినా ఆయన ఉబ్బిపోతాడా? లేక మీ ధనాన్ని ఆశించి మీకు మోక్షాన్ని ప్రసాదిస్తాడా? భగవంతుడు అంత మూర్ఖుడా? నీవు ధనాన్ని భగవంతునికి సమర్పిస్తే సజ్జనుడు అనిపించుకుంటావు. ఇవ్వకపోతే లోభి అనిపించుకుంటావు.

భగవానుడు కేవలం స్వామియే కదా! ఆయన కైంకర్యానికి సమర్పించిన ధనంగానీ, పదార్థంగానీ ఇతరులకు వినియోగ పడుతోందిగానీ ఆయన స్వీకరిస్తున్నాడా? దీనిని అర్థం చేసుకోండి.

మనమంతా కూర్చున్న ఈ బిల్డింగు ఎంతో వ్యయప్రయాసలతో వ్యాపారంచేసి ధనాన్ని ఆర్జించి కట్టాడు. ఆయన ఇప్పుడున్నాడా? పోనీ ఎక్కడ ఉన్నాడో చెప్పగలరా? ఆయన చనిపోయాడు. ఆయన

జీవితకాలంలో ఏం సాధించాడు? మానవుడు ఆశాజీవి కాబట్టి ఆయన బంధుమిత్రులంతా చనిపోయిన వ్యక్తి స్వర్గంలో ఉన్నాడని భావించవచ్చు. పోనీ స్వర్గం ప్రాప్తించింది అనుకుందాం. తిరిగి జన్మకు రావల్సిదేకదా! మళ్ళీ మానవ జన్మప్రాప్తిస్తుందని గ్యారంటీ ఉందా? కాబట్టి మానవుడు తన జీవితకాలంలో భగవంతుని విశ్వసించి, ధ్యానించి తానెవరో తాను తెలుసుకొననట్లైతే వట్టి చేతులతో మట్టిపాలుకాక తప్పదుకదా! ఏమిలాభం చెప్పండి? ఇదేనా మానవ జీవిత లక్ష్యం? వ్యక్తులు దేశాలు పరిణామం చెందేవే కదా! పరిణామం చెందని ఆత్మ వస్తువును గూర్చి విచారణ చెయ్యాలి. అంటే తనని గురించి తాను తెలుసుకోవాలి. అలా తెలుసుకోవటమే ఆత్మజ్ఞానము. అటువంటి సాధకుడు బ్రతికి ఉండగానే మోక్షాన్ని పొందుతాడు.

బట్టతల ఉన్నవాడూ, జుట్టు తక్కువగా ఉన్నవాడూ తలకి విగ్గు పెట్టుకుంటారు. వారి సంగతి అలా ఉంచండి. మరికొంతమంది తిరుపతి వెళ్ళి తలబొప్పనం చేయించుకుని, దానిని కప్పిపుచ్చుకోవడానికి విగ్గు పెట్టుకుంటారు. బొప్పనం చేయించుకోవడం ఎందుకు? విగ్గుపెట్టు కోవడం ఎందుకు? అదే దేహాభిమానం, తలకి విగ్గు పెట్టుకున్నవాళ్ళు కడు జాగ్రత్తగా ఉండాలి. గట్టిగా తలకదిపితే విగ్గు ఊడిపోతుంది. వారి నిజ స్థితి బయటపడుతుంది. అలాగే కట్టుడు పళ్ళు ఉన్నవాళ్ళు గట్టిగా మాట్లాడితే పళ్ళు ఊడి క్రింద పడతాయ్.

సద్గురుమూర్తి సన్నిధిలో భయంతో వినయ విధేయతలు ప్రదర్శించే కపట భక్తుడు తనపని ముగించుకుని ఎలాగో బయటపడతాడు. దానినే అవసరార్థ భక్తి అంటారు. కానీ నిజమైన భక్తుడు సద్గురుమూర్తి సన్నిధిలో భయపడవలసిన పనేముంది? అందువలననే కపట భక్తుడు తనలోనే ఉన్న ఆత్మ తేజస్సును అందుకోలేడు. అచంచలభక్తి కలిగిన సాధకుడు తాను అనుకున్నది సాధించగల్గుతాడు. మన సాధనకి అవరోధంగా ఉన్న దానిని దేనినైనా సరే త్యాగంచేసి మన గమ్యస్థానాన్ని చేరాలి అనే పట్టుదలని ప్రసాదిస్తుంది. దానిని అందజేసేవాడే సద్గురుమూర్తి. అటువంటి త్యాగమునే వైరాగ్యము అంటారు" అన్నారు.

# అమ్మ మాట

- జపమాల ప్రసాద

"ఒక భక్తుణ్ణి కాసేపు ఉపన్యసించండి అన్నాను. ఆయన 'నేను పదిహేను నిమిషాలు మాట్లాడతాను' అన్నాడు. నేను మౌనంగా వున్నాను. ఆయన నా మౌనాన్ని అంగీకారంగా భావించి, కరెక్టుగా 15నిమిషాలలో ఆయన ఉపన్యాసాన్ని ముగించాడు. నేను ఆయనను 15నిమిషాలు మాత్రమే మాట్లాడమనిగానీ, అది దాటితే మాట్లాడవద్దని గానీ అనలేదు. ఆయనకు ఆయనే ఒక హద్దును ఏర్పరచుకుని, దానికి పరిమితమైపోయాడు. ఏ కారణం వలనో తనను తానే బంధించుకున్నాడు.



భగవద్వస్తువు కాలతీతమైనది. బాబు మనకు ఆశ్రమాన్నిచ్చి, 'చక్కగా కాలంతో ప్రమేయం లేకుండా, విశ్వాత్ముడైన విశ్వనాథుణ్ణి గురించి మాట్లాడుకోండి' అని ఆజ్ఞాపించారు. 'అలా సద్విషయంలో గడిపిన కాలం మీకు నిత్యకాలంలో జమ అవుతుంది' అని ఎప్పుడూ అనేవారు. 'అది మీకు బ్యాంకు బ్యాలెన్స్ లాంటిది' అనేవారు. మరి మనం కాలానికి అంతగా ఎందుకు కట్టుబడిపోతున్నాము?

ఒకరోజున కొందరు భక్తులు శ్రీబాబు దర్శనార్థం వచ్చారు. అప్పుడు నేను సుందరకాండ పారాయణ దీక్షగా చేస్తున్నాను. ఆ వచ్చిన భక్తులకు సూతకం అని నాకు తెలుసు. వాళ్ళతో మాట్లాడితే నా దీక్షకు ఎక్కడ భంగం అవుతుందో అని, వాళ్ళు నన్ను పలకరించటానికి ముందే నా ముఖం తిప్పుకున్నాను. 'అమ్మయ్య! నా దీక్షను కాపాడుకున్నాను' అనుకుని సంతోషిస్తూ బయటకు వచ్చి చూసేసరికి చాలా ఆశ్చర్యపోయా! శ్రీబాబు వారితో కలిసి కూర్చుని కులాసాగా మాట్లాడుతున్నారు. అప్పుడు నాకు అనిపించింది వారికి లేని సూతకం, మైలా నాకెందుకు? అని. నిజమే మహాత్ములకు కోవిధిః? కో నిషేధః? అనటం ధర్మమే. కోరికలు లేనిచోట దేశ కాల నియమాదులు ఉండవు కదా!

కానీ నియమాలు అవసరమే. నియమం లేనిదే దీక్ష ఫలించదు.

కానీ దీక్ష యొక్క ధ్యేయం ఏమిటి? ఏదో ఒక కోరికతో దీక్ష ప్రారంభిస్తే నియమాలు తప్పక పాటించాలి. ఏ కోరికా లేనివారికి దీక్ష ఎందుకు? నియమమెందుకు?

గోపికలకు, గోపబాలురకు, శ్రీకృష్ణస్వామికి హెచ్చుతగ్గులు లేవు. పురుషసూక్తంలో చెప్పిన విరాట్‌స్వరూపానికి దుర్వ్యాఖ్యానం చెప్పుకోలేదు వాళ్ళు. భగవంతుని ముఖంలో నుంచి పుట్టారు కనుక బ్రాహ్మణులు అందరి కంటె ఎక్కువనీ; బాహువులలో నుండి క్షత్రియులు పుట్టారు కనుక వారి తరువాత వారనీ, ఊరువులలో నుండి పుట్టినవారు కనుక వైశ్యులది మూడవ స్థానమనీ, పాదాలలలో నుండి పుట్టిన శూద్రులు అందరికంటె తక్కువనీ వాళ్ళు ఎన్నడూ అనుకోలేదు.

విరాట్‌స్వరూపం సమాజం యొక్క ప్రతీక చిత్రం. పాదాలు లేని వ్యక్తి నిలబడలేడు. మనిషి స్థిరత్వానికీ, పురోగమనానికీ పాదాలు అవసరం అయినట్లే, సమాజ సుస్థిరతకూ, పురోగాభివృద్ధికీ శూద్రులు చాలా అవసరం అని శృతి చెబుతోంది. విష్ణుపాదోదకమైన గంగను బ్రాహ్మణులు తమను పవిత్రం చేసేదిగా భావించి నెత్తిన చల్లుకుంటారు. గంగ ఎక్కడ పుట్టినదో, శూద్రులూ అక్కడే పుట్టారు. వాళ్ళిద్దరూ అక్కాతమ్ముళ్ళు. పవిత్రులు కానివారు లేరు. అపవిత్రత మధ్యలో కొనితెచ్చుకుంటే వచ్చింది.

అందుకనే శ్రీకృష్ణభగవానుడు 'గొల్ల'లలో పుట్టాడు. గోప బాలురకు ఏ భేదమూ తెలియదు. బాలకృష్ణుడు వ్రేళ్ళ మధ్యలో యిరికించుకున్న ఆవకాయ ముక్కలను ఎంగిలని భావించకుండా ఎగబడి మరీ తిన్నారు. 'అయ్యో! ఆయన మన పాలకుడే! మహారాజు బిడ్డే! గొప్పింటివాడే!' అని వారు అనుకోలేదు. 'మన కృష్ణుడు, మనలోనివాడు' అనుకున్నారు. 'సమం ఏకం బ్రహ్మ' అనే సూత్రాన్ని వారికి తెలియకుండానే వారు పాటించారు.

అసలు భేదమనేది లేదు. అంతా మన మనస్సు కల్పించుకునేదే. మానవునికి మానవునికి మధ్య భేదబుద్ధి నశించటమే పరమార్థం. ఈ జ్ఞానాన్ని సంక్రమించుకోవటమే సంక్రాంతి. అద్వైత ఆత్మానందాన్ని అనుభవించటమే భోగి. అలా మానవజాతిని ఆశీర్వదించమని శ్రీగురుదేవులను మనం ప్రార్థిద్దాం" అన్నారు శ్రీమాతాజీ.

# అంతఃకరణ చతుష్టయం

- పరాశర ప్రసాద్

శ్రీ సద్గురుదేవులు అంతఃకరణ చతుష్టయం గురించి తరచుగా ప్రస్తావిస్తూ ఉండేవారు. సాధకులు ముందుగా నిర్మల అంతఃకరణ సాధించాలని ఉద్బోధించేవారు.

మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అంతఃకరణ చతుష్టయంగా భావనచేయ బడతాయి.అంతఃకరణ స్వరూపము స్వభావము గురించి సాధకుడు అవగాహనకి వస్తే, సాధనలో ప్రధాన ప్రతిబంధకమైన అంతఃకరణము ఎలా అధిగమించాలో తేటతెల్ల మవుతుంది.

అంతఃకరణము పంచభూమికలు లేక పంచ అవస్థలతో కూడినది. 1. క్షేపము, 2. మూఢత, 3. విక్షేపము, 4. ఏకాగ్రత, 5. నిరోధము.

సాధకుని అంతఃకరణము వాసనాత్రయముతో అనగా లోకవాసన, దేహవాసన, శాస్త్రవాసనతో కూడి ఉంటే ఆ స్థితిని భూమికని క్షేపభూమిక అనవచ్చు. అలాకాకుండా అంతఃకరణమందు సాధనకు అవరోధంగా నిద్ర, సోమరితనం అనబడే తమోగుణాలతో కూడివుంటే దానిని మూఢత అని పిలువబడుతుంది. అధిక శాతం సాధకులలో ధ్యానమో, పారాయణో ప్రారంభించగానే మనస్సు ధ్యేయంపై నిలబడక, బహిర్ముఖమై ఇతర విషయాదులపై భ్రమణం చెందటాన్ని విక్షేపం అంటారు. సాధనలో గురుసాంప్రదాయంలో ఉండి సద్గురుమూర్తి ఆదేశానుసారం సాధనను కొనసాగించే సాధకులలో అంతఃకరణ అతీత పరిణామం, వర్తమాన పరిణామం సమానంగా ఉంటుంది. ఆ స్థితిని ఏకాగ్రతగా పరిగణించవచ్చు. అంతఃకరణ ఏకాగ్రత స్థితిలో ఉన్న మనస్సు బ్రహ్మాకారము పొంది ఉండకపోవచ్చు. కాని సమాధి స్థితిని సాధించిన సాధకునిలో మనస్సు కేవలం బ్రహ్మాకారమును పొందిన ఏకాగ్రతాధిక్యమును నిరోధము అంటారు. అక్కడ అంతఃకరణ అభావ స్థితిలో వుంటుంది.

ఆత్మవస్తువును అవలంబింపని చిత్తవృత్తి నిద్రారూపము లేక లయగా భావించవచ్చు. అలా కాకుండా ఆత్మవస్తువును అవలంబింపక

అన్యవస్తువును ఆస్వాదించే స్థితి విక్షేపము. లయ, విక్షేపములను అధిగమించినను రాగాది వాసనలచేత వృత్తి అంతర్ముఖమైనప్పటికి ఆత్మవస్తువును గూర్చి చింతన చేయని స్థితి కూడా సంభవమే ఆ స్థితి కషాయము అని పిలువబడుతుంది. సాధనలో సమాధి స్థితిని సాధించిన సాధకుడు ఆత్మవస్తువు అవలంబనము పొందనప్పటికి పొందే ఆనందస్థితి రసాస్వాదనముగా భావనచేయ బడుతుంది.

ఆత్మతత్త్వము విషయము కాదు. భావన అంతకన్న కాదు. ఆలోచనకి అందేదికాదు. అందువలన మనోబుద్ధులకు అతీతమైనదిగా గ్రహించాలి. దృశ్య ప్రపంచానికి ఆవలనున్న అట్టి తత్త్వాన్ని గ్రహించాలంటే మనోబుద్ధులను అధిగమించాలి. పోనీ గాఢ సుషుప్తిలో పొందే అభావస్థితి అంతకన్న కాదు. అది కేవలం ఆనందస్థితి. అది వృత్తిలో పరివర్తన ద్వారా సాధ్యపడుతుంది. అదే పురుష ప్రయత్నం. అదే సాధన ధ్యేయం. సద్గురు సమాశ్రయమే దానిని సాధించగల ఏకైక మార్గం" అన్నారు సద్గురుదేవులు.

## అర్పణ

ఒక భక్తురాలు రమణభగవాన్ సమక్షంలో తాను స్వయంగా వ్రాసిన పాటను వీణపై మనోజ్ఞంగా పాడింది. ఆ పాట తాత్పర్యం ఇది. "నా ఐశ్వర్యాన్ని, హోదాను, కామ క్రోధాలను, ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని - భగవాన్! మీ పాదాల పై అర్పిస్తున్నాను" అని. పాట ముగియగానే ఆమె నిలబడి రమణ భగవాన్‌కి నమస్కరించింది.

భగవాన్ "అమ్మా! ఒక్కమాటతో సరిపోయేదానికి ఇంతపాట, రాగము, తాళము ఎందుకు? 'నేను'ను అర్పిస్తున్నాను అంటే సరిపోయేది కదా! 'నేను' ఆశ్రయించుకుని కదా ఇవన్నీ ఉన్నాయి. ఇంతే! మనుష్యులు 'నేను' ఉంచుకుని అన్నీ అర్పిస్తారు. ఇదే సమర్పణ అనుకుంటారు. కాని అసలైన 'నేను'ను అర్పించుకోవటమే నిజమైన అర్పణ. అది తెలుసుకోరు" అన్నారు.

# సచామర రమావాణీ సవ్యదక్షిణ సేవితా

- పాలూరి కాళీప్రసాద్ U.S.A

సాధారణంగా మనకు ఏదైనా ప్రభుత్వశాఖలో పని వుంటే, ఆ శాఖలోని ఏ క్రింది స్థాయి ఉద్యోగస్తులతోనో మొదలుపెట్టి, కార్యదర్శి దాకానో, మంత్రిదాకానో బ్రతిమిలాడుతూ తిరుగుతాం. అదే ప్రధాన మంత్రితో మనకు గాఢమైన స్నేహం ఉన్నదనుకోండి, ఆ మంత్రులే మనకు ఎదురు వచ్చి, మనకు కావలసిన పనులన్నీ చేసిపెడుతూ ఉంటారు.



ఈ రోజులలో ప్రతివారూ సహజంగా కోరుకునేవి రెండు. తమకు అంతులేని సంపద. తమ బిడ్డలకు అపారమైన విద్య. మరి ఆర్థికశాఖకు, విద్యాశాఖకు అధిపతులు ఎవరు? లక్ష్మీదేవి, సరస్వతీదేవి కదా? వారిద్దరూ ఏం చేస్తుంటారో ఈ నామం చెబుతోంది.

వారిద్దరూ ఎప్పుడూ జగన్మాతకు కుడి ఎడమ ఇరువైపులా నిలబడి, సేవికలవలె వింజామరలు వీస్తూ ఉంటారు.

మరి ఆ జగన్మాతను మనస్సులో నిలుపుకుని, ఆ తల్లియందు గాఢమైన భక్తి ప్రపత్తులు కలిగినవారికి, అటు సంపదలోను, ఇటు విద్యలోను ఏం లోటు ఉంటుంది?

దీనికి మనకు అటు మహాకవి కాళిదాసు, ఇటు తెనాలి రామలింగ కవుల జీవితాలే ప్రత్యక్ష నిదర్శనాలు.

ఇంత స్పష్టంగా మన కోరికలు తీరే మార్గం కనిపిస్తుంటే, మన పనుల కోసం లోకంలో వారిని, వీరిని ఆశ్రయించే వారు ఎంతటి అవివేకులు?

# విభీషణుని ధర్మదీక్ష

- నాగేశ్వరరావు

రామరావణ యుద్ధం భయంకరంగా జరుగుతోంది. కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు మొదలైన రాక్షసవీరులు కూలిపోయారు. ఇక రాక్షసబలం నడుము విరిగిపోయిందనుకున్నారు అందరూ!

ఇంతలో భూమి ఆకాశం ఆక్రమిస్తూ ప్రళయకాల మేఘంలా ఓ భీకరాకారుడైన రాక్షసయోధుడు ప్రత్యక్షమై ప్రభంజనంలా విజృంభిస్తూ దిశలు దద్దరిల్లేటట్లు గర్జిస్తూ వానరసైన్యంపై అగ్నివర్షం కురిపిస్తున్నాడు. ఆ మహోద్ధృతికి వానర సైన్యం కకావికలౌతోంది.

అప్పుడు విభీషణుడు శ్రీరామచంద్రుని సమీపించి, "రాక్షసాంతకా! ఇతడు లక్ష్మణుని కంటె బలవంతుడు. రావణసేనలో అందరి కంటె దిట్ట. ఇతనిని ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా మన సేన మనకు దక్కదు. నీ శక్తిని అంతా వినియోగించి అస్త్రాలను ప్రయోగించు" అన్నాడు.

శ్రీరామచంద్రుడు ఆ రాక్షసుడు ద్వంద్వ యుద్ధానికి తలబడ్డారు. ఒకరినిమించి ఒకరు విజృంభిస్తున్నారు. ఉభయసైన్యాలు, ఆకాశంలో దేవతలు సంభ్రమాశ్చర్యాలతో ఆ యుద్ధాన్ని తిలకిస్తున్నారు. రాముని అస్త్రాలు రాక్షసుని శరీరాన్ని తాకుతున్నకొద్దీ, రాక్షసుడు రెచ్చిపోయి మరింత పరాక్రమంతో దీప్తిస్తున్నాడు. సూర్యాస్తమయం కావస్తోంది.

అప్పుడు విభీషణుడు శ్రీరాముని సమీపించి, "ఓ కోదండపాణి! ఇదే సమయం. ఏ మాత్రం ఆలస్యం చేయకు. అస్త్రాన్ని మంత్రించి, అతని ఎడమకాలి బొటనవ్రేలి మీద ప్రయోగించు. ఆలస్యం చేస్తే అతనిని సంహరించటం అసాధ్యం" అని హెచ్చరించాడు.

రాముడు అలాగే చేశాడు.అటు రాక్షసుడు నేలకూలాడు! ఇటు విభీషణుడు మూర్ఛిల్లాడు! అప్పుడు తెలిసింది ఆ రాక్షసుడు విభీషణుని కుమారుడని!!

కొంతసేపటికి విభీషణుడు తేరుకుని, "రామా! అదంతా మరచిపో. ధర్మాన్ని ఎదిరించినవాడు ఎవడైనా సరే, వానిపై మమకారం ఉంచకూడదు. ఈ విధంగా ధర్మం మనలను ఆదేశిస్తోంది" అన్నాడు.

శ్రీరామచంద్రుని అనుగ్రహవీక్షణాలు విభీషణుని ముంచెత్తాయి!

# మానవ శరీరమే పరమాత్ముని మందిరం

- రమణ ప్రసాద్

అనేక వేల జన్మలలో చేసిన పుణ్యాలకు ఫలితంగా ఈ మానవ శరీరం మనకు దొరుకుతుంది. ఈ శరీరం దొరకడం దేవతలకు కూడా సాధ్యం కాదు. ఈ శరీరాన్ని వ్యర్థంగా నష్టపరచటం మనం చేస్తున్నట్టి తప్పులలో పెద్ద తప్పు. మనం మన కర్తవ్యాలను మరువటం; మనకు జన్మనిచ్చిన స్వామిని స్మరించకపోవటం; నియమాలను పాటించక పోవటం చేస్తున్నాం కదా! అప్పుడు మనమే దుఃఖం కలవాళ్ళం అవుతాం. ఇంకెవరౌతారు?

ఈ శరీరం పరమాత్ముని మందిరం వంటిది. దీనిలో ఈశ్వరుడు నివసిస్తున్నాడు. అతడు మీలోనే ఉన్నాడనే భావనను ఎప్పుడూ అనుభవించండి. ఈ మందిరాన్ని ఎప్పుడూ కూడా అపవిత్రం చేయకండి. ఈ మందిరాన్ని అపవిత్రంగా వుంచడానికి ఉపయోగపడే కొన్ని మాటలున్నాయి. వాటి నుండి మిమ్మల్ని కాపాడుకోండి.

ఆ మాటల్లో అతి చెడ్డది. అసత్యం. మరచిపోయిగాని, మెలకువలోగాని, నీ నోటి నుండి 'అసత్యమైన మాట రావద్దు' సత్యవచన పాలనకై శ్రద్ధగా ప్రయత్నం చేయండి. ఒకవేళ పొరపాటుగా మీ నోటివెంట అసత్యమైన మాట దొర్లితే, అట్టి తప్పుడు మాటలను క్షమించమని భగవంతుని ప్రార్థించండి. వాస్తవమైన హృదయంతో, పవిత్ర హృదయంతో పరమాత్ముని పాదాలపై పడి నమస్కరించండి. మరోసారి అసత్యం పలుకనని భగవంతుని ముందర ఒట్టు పెట్టుకోండి. మీరిచ్చిన మాటను ప్రాణపాయ స్థితి వచ్చిననూ పాటించండి.

# సీతాదేవి

- అచల

మహాజ్ఞానియైన జనకమహారాజు పుత్రకామేష్టి యాగం కోసం యాగశాలను సిద్ధం చేయటానికి భూమిని దున్నినప్పుడు ఒక బంగారు పేటిక బయటపడింది. ఆ పెట్టెలో పసిడికాంతులు విరజిమ్మే ఒక పసిపాప కనిపించింది. - మొక్కబోయిన వేలుపు ముంగిట్లో ఎదురైనట్లుగా మురిసి పోయిన జనకమహారాజు - నాగేటి చాలులో లభించటం వల్ల భూజాతకు 'సీత' అని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచారు.

ఆమె అందానికే అందం. అందమే యుగయుగాలుగా తపస్సు చేసి సంపాయించిన అందాలరాశి ఆమె. ఆమె శివధనుర్భంగం చేసిన శృంగార గుణాభిరాముడైన కోదండ రాముని - తండ్రి ఆనతి మేరకు పెళ్ళాడింది. దశరథ మహారాజు కోడలుగా అయోధ్యకు చేరింది.

తండ్రి మాట నెరవేర్చడం కోసం వనవాసానికి వెడుతూ ఆ సంగతిని తెలియజేయడానికి అంతఃపురానికి వచ్చిన రాముని "కన్నవాళ్ళ మాటను పాటించటం మీ కర్తవ్యం కావచ్చు. కానీ తాళికట్టిన నన్ను మీతో రావద్దనటం ఎలా న్యాయం?" అని నిలదీసి అడిగింది. 'అడువుల బ్రతుకు కష్టాలతో కాపురం చెయ్యడం. నీలాంటి సుకుమారికి అది మరీ కష్టం' అని రాముడు నచ్చజెప్పటానికి ప్రయత్నించినప్పుడు; "కష్టాల కడలి అయినా మీ నీడగా మీతో రావటమే నాకు ఇష్టం. అలా కాదని నేను మీతో రావడమే మీకు కష్టం అంటే మీ ఇష్ట ప్రకారమే మీరు చెయ్యండి" అని సవినయంగా తన అభిమతాన్ని వ్యక్తం చేసింది. వనవాసానికి రాముని వెంట నడిచి కష్టసుఖాలలో పెనిమిటితో పాలుపంచుకున్న అర్ధాంగిగా చరిత్రలో నిలిచిపోయింది.

ఓ రోజు అందాలుచిందే బంగారులేడి చిత్రకూట పర్వత ప్రాంతంలో తిరుగుతుంటే దాన్ని ప్రాణంతో పట్టి తెమ్మనమని రాముని పట్టుపట్టి కోరింది. రాముడు బయలుదేరాడు. కాసేపటికి దీనాతిదీనంగా 'హా సీతా!' అని రాముని కంఠస్వరం వినబడేసరికి ఆయనకు ఏ ఆపద వాటిల్లిందో అని, బలవంతంగా లక్ష్మణుని చూసిరమ్మనమని పంపించింది.

సన్యాసి వేషంలో వచ్చిన రావణుని చూసి, మోసపోయి, అతనిచే

అపహరింపబడి, లంకలో అశోకవనంలో శోకదేవతలాగా గోడుగోడున విలపించింది. రాముడే ఎనాటికైనా వచ్చి తనను చెరను విడిపిస్తాడనే ఆశతో ప్రాణాలు నిలుపుకున్నది. లంకేశుడు ధర్మవిరుద్ధమైన కామ వాంఛను వెల్లడించినప్పుడల్లా "ధర్మానికి విరుద్ధంగా పాపకృత్యాలకు పాల్పడి నాశనం కావద్దు" అని హెచ్చరించింది. కానీ కామాంధుడైన రావణుడు కళ్ళు తెరవలేదు.

తన జాడ తెలుసుకోవటానికి వచ్చిన రాముని దూత హనుమంతుని ద్వారా - "ఒకవేళ తను ఇక్కడే మరణించినట్లయితే మరు జన్మలో కూడా రాముడినే భర్తగా పొందే వరాన్ని ప్రసాదించమని" దాశరథిని ప్రార్థించిన ఘన శీలవతి సీత.

రావణ వధానంతరం నీలమేఘశ్యాముడైన రాముని చరణ కమలాల ముందు వ్రాలింది సీత. ఆమె మనస్సు మయూరంలా నాట్యం చేసింది. కాని తన శీలాన్ని శంకిస్తూ, పడగవిప్పిన పాములా కటువుగా మాట్లాడిన రాముని చూసి దిగ్భ్రాంతి చెందింది సీత. తన శీల నిరూపణ కోసం అగ్నిలో దూకింది. కాని ఆ మంటలు ఆమెను పావన గంగలాగ సేదతీర్చాయి. అందరి మనస్సుల్లో మల్లెవాన కురిసింది. రాముని కన్నులలో వెన్నెల విరిసింది. సీతను స్వీకరించాడు. పట్టాభిషేకం జరిగింది.

రాజాప్రసాదంలో సర్వసుఖాలతో కొన్నాళ్ళే గడిపింది. ఎవరో ఏదో అన్నారనే అపవాదును బాపుకోవటం కోసం తిరిగి రాముడు సీతను నిండు చూలలను అరణ్యాలపాలు చేసినా కూడా భర్తను పల్లెతు మాట అనలేదు. అష్టకష్టాలు పడుతూ అడువులలో తిరిగింది. చివరికి వాల్మీకి మహర్షి ఆశ్రమంలో ఆశ్రయం లభించింది. అక్కడే లవకుశలను ప్రసవించి, వారికి విద్యాబుద్ధులు నేర్పి, ఆదర్శయువకులుగా తీర్చిదిద్ది, తిరిగి వారిని శ్రీరామునకు అప్పగించింది.

రాకుమార్తెగా పెరిగి, రారాజుకు భార్య అయికూడా అష్టకష్టాలు పడింది సీత. అయినా కూడా ధర్మపరిరక్షణలో భర్తకు ఉత్తమ అర్థాంగిగా నిలిచి చరిత్రలో శాశ్వత కీర్తిని సంపాదించిన సీత మన జాతి జీవనంలో అంతర్భాగంగా ప్రవహిస్తూనే ఉంటుంది!!

# ఆలోచనలను అరికట్టు - వర్తమానంలో జీవించు

- రమణ ప్రసాద్

" ఏమిటాలోచిస్తున్నావు?" అని నిన్ను ఎవరైనా అడిగితే, " ఏమీ లేదు" అని సమాధానం చెబుతావు. కాని అది నిజం కాదు. నీ మనస్సు జరిగిన, జరుగుతున్న, జరుగబోవు విషయాలను ఆలోచిస్తూ ఉంటుంది.

భగవద్గీతలో అర్జునుడు," ఓ కృష్ణా! ఈ మనస్సు మిక్కిలి చంచలమైనది. దీనిని నిగ్రహించటమంటే గాలిని పట్టుకున్నట్లే'' అంటాడు. శ్రీభగవానుడు, " అర్జునా! నిజమే! నిస్సందేహంగా మనస్సు చంచలమైనదే. కాని నిరంతర అభ్యాస వైరాగ్యాలచేత దానిని వశపరచుకోవచ్చును" అని సమాధానం ఇస్తాడు. నిరంతర అభ్యాసం దేని గురించి అంటే - నీ మనస్సులో వచ్చే ఆలోచనలను సాక్షీభావంతో గమనిస్తూ వాటిని అరికట్టడం. దానికి వైరాగ్యం తోడ్పతుంది.




నువ్వు ధ్యాన ముద్రలో కూర్చున్నావు. నీ మనస్సులో ఆలోచనలు పరిగెడుతుంటాయి. నీలో వచ్చే ఆలోచనలను ఆపటానికి ప్రయత్నించకు. నీ ఆలోచనలకు కార్యరూపం ఇవ్వకుండా వాటిని సాక్షీభావంతో గమనించడం మొదలు పెట్టు. నీలో వచ్చే ఆలోచనలు కదిలిపోయే మేఘాలు లాగా చూడు. ఆ ఆలోచనల ప్రభావంకు లోను కాకుండా జాగ్రత్త పడు. ఈ విధంగా చేసే అభ్యాసం వల్ల ఆశ్చర్యకరంగా నీలో వచ్చే ఆలోచనలు తగ్గిపోతాయి. నీ మనస్సు నిర్మలమై, నువ్వు ధ్యానించే ధ్యేయ

వస్తువుపై నిలుస్తుంది. కాని మానవ నైజం ఏమిటంటే జరిగిన విషయాలను తలచుకుని బాధ పడటమో, లేక భవిష్యత్తులో జరగబోయే విషయాలను ఊహించుకుని దిగులు చెందటమో జరుగుతుంది.

" నీ మన శ్శరీరాలు నియంత్రణలో ఉండాలంటే, గతంలో జరిగిన వాటి గురించి, భవిష్యత్తులో జరగబోయే వాటి గురించి కలత చెందకు. వర్తమానంలో వివేకవంతంగా జీవించు" అంటాడు బుద్ధుడు. కాబట్టి మోక్షగామి ఎల్లప్పుడూ వర్తమానంలో జీవించటం అలవాటు చేసికోవాలి. మనస్సులో వచ్చే ఆలోచనలను నియంత్రించాలి.

భగవానుడు, 'అంత్యకాలంలో ఏ ఏ భావాలపై మనస్సు నిలుస్తుందో మరుజన్మలో మానవుడు ఆ రూపాన్ని పొందుతాడు. కాబట్టి అర్జునా! నీవు నా యందే మనస్సు నిలుపు. నన్నే పొందగలవు' అని భగవద్గీతలో ఉపదేశం చేశాడు.

కాని అంత్యకాలం ఎప్పుడు సమీపిస్తుందో ఎవరికెరుక? ఈ క్షణమే నీది. ఈ క్షణంలో నీ మనస్సు భగవంతుని యందు నిలిపితే నువ్వు భగవంతుడిని పొందినట్లే కదా! అదే వర్తమానంలో వివేకవంతంగా జీవించడం అంటే.

దీనికి కావలసినవి - విచారణ, వైరాగ్యం, వివేకం, ఓర్పు, నిరంతర అభ్యాసంతో ప్రపంచ విషయాలనుండి విముఖుడై తనలో వచ్చే ఆలోచనలను సాక్షీ భావంతో చూసినట్లైతే, అతని మనస్సు నిరాలోచన స్థితి(అమనస్కస్థితి)కి చేరుతుంది. ధ్యానంలో నీ మనస్సు బ్రహ్మాకార వృత్తిలో నిలిచిపోతుంది. అదే జీవన్ముక్త స్థితి.

"నీ మనస్సు భగవానునిపై నిలచినా, లేక భగవానుడు నీ మనస్సులో నిలచినా ఇక జపతపములేల?" అని కదా శ్రీ గురుదేవుల వాక్కు.

మనస్సుని నిర్విషయం చేసికొని భగవంతుని యందు నిలపడమే నీ గమ్యంగా చేసుకో! జీవన్ముక్తుడవు కా!

# దేవుడు ఎక్కడ ఉన్నాడు?

- ఎమ్. ఆర్. నాగేశ్వరరావు.

పూర్వం కళింగదేశపురాజు తన పురోహితుణ్ణి పిలిచి దేవుణ్ణి గురించి మూడు ప్రశ్నలు అడుగుతూ వారం రోజుల్లో సరియైన జవాబు చెప్పకపోతే కఠినంగా శిక్షిస్తానన్నాడు. ఆ ప్రశ్నలు ఇవి - 1. దేవుడు ఏం చేస్తూ ఉంటాడు? 2. దేవుడు ఎక్కడ ఉన్నాడు? 3. దేవుడు ఎటు చూస్తూ ఉంటాడు? పురోహితుడికి జవాబు తోచక దిగులుతో మంచమెక్కి రోజులు గంటలు లెక్కపెట్టుకుంటున్నాడు. అతని పశువులకాపరి అంతా విని, పురోహితుని సమీపించి, "అయ్యా! ఈ ప్రశ్నలకు నేను జవాబు చెప్పి వస్తాను. మీరుండండి" అంటూ రాజధానికి బయలుదేరాడు. పశువుల కాపరి రాజుగారి ముందు నిలబడి ఉన్నాడు. రాజుతో సహా అందరూ నవ్వుకున్నారు. రాజు "సరియైన సమాధానం చెప్పలేక పోతే శిరస్సు ఖండిస్తాను తెలుసా?" అని హెచ్చరించాడు. "జవాబు చెప్పటానికే కదా వచ్చాను. అయితే ఒక సంప్రదాయాన్ని పాటించాలి. అడిగేవారు శిష్యులు, చెప్పేవారు గురువులు గదా! కనుక మీ దుస్తులన్నీ నా కిచ్చి, మీరీ కంబళి కప్పుకుని, నా ముందు చేతులు జోడించి నిలబడాలి. నేను సింహాసనం మీద కూర్చోవాలి. ఏమంటారు?" అన్నాడు పశువులకాపరి.

రాజు అంగీకరించాడు. పశువులకాపరి దివ్యాభరణాలతో, కిరీటంతో రత్నసింహాసనంపై ఠీవిగా కూర్చున్నాడు. రాజు కంబళీ కప్పుకొని, చేతులు జోడించి, మొదటి ప్రశ్న అడిగాడు - "దేవుడు ఏం చేస్తూంటాడు?" అని. దానికి సమాధానంగా "ఇంకా ప్రత్యేకించి చెప్పాలా! దేవుడు రాజుని దరిద్రుడుగా, దరిద్రుడుని రాజుగా క్షణాలమీద చేస్తుంటాడు" అన్నాడు. 2. దేవుడెక్కడున్నాడు? - "పాలలో వెన్న ఎక్కడున్నది? అంతటా నిండి ఉన్నది. అయితే ఆ పాలను కాచి మీగడతీసి చిలికితే వెన్న కనబడుతుంది. అదే విధంగా భక్తుడు ఆత్మార్పణ కావించుకుని నిరంతరం భగవంతుని ప్రార్థిస్తే అంతటా నిండివున్న భగవంతుడు సాకారంతో ప్రత్యక్షమౌతాడు. 3. భగవంతుడు ఏమి చూస్తుంటాడు? - " దీపం ఎటు చూస్తోంది? ముందుకా? వెనుకకకా? ప్రక్కలకా? ఏక కాలంలో అన్ని దిశలూ చూస్తోంది. అదే విధంగా భగవంతుడు అంతటా చూస్తున్నాడు." అన్నాడు.

ఈ జవాబులకు రాజు ఆనందపడి విలువైన బహుమతులతో పశువుల కాపరిని సత్కరించాడు.

# నిర్మల హృదయం

- పాలూరి కాళీప్రసాద్ U.S.A

సాధకుడైనవాడు భగవంతుని పొందటానికి తన మనస్సుని ఏ విధంగా మార్చుకోవాలి అనే విషయంలో శ్రీబాబూజీ మహరాజ్ ఒక చక్కటి సన్నివేశాన్ని తెలిపేవారు.

నిజానికి రాధాకృష్ణులు తత్త్వతః ఏకస్వరూపులైనా, రాధకు కృష్ణునితో భౌతికంగా నిరంతర సాన్నిహిత్యం లభించేది కాదు. రోజులో కొద్ది సమయం మాత్రమే ఆమె శ్రీకృష్ణునితో గడపగలిగేది. మిగిలిన గోపికలందరిది కూడా ఇదే పరిస్థితి. కానీ రోజులో ఒక్క క్షణం కూడా విడవకుండా నిరంతర సాన్నిహిత్యం పొంద గలిగినది ఒక్క వేణువు మాత్రమే. ఈ విషయంలో రాధకు కొంత అసూయతోపాటుగా, అసలు ఈ భాగ్యాన్ని పొందటానికి ఆ వేణువు చేసిన సాధన ఏమిటో తెలుసు కోవాలనే ఉత్సుకత కలిగింది. అయితే కృష్ణుడు లేనప్పుడు ఆ వేణువును చేజిక్కించుకోవటం ఎలా??

కరుణామయుడైన గోవిందుడే ఆ అవకాశాన్ని కల్పించాడు. ఒకనాడు యమునాతీరంలో ఇసుక తిన్నెలపై శయనించినప్పుడు, రాధ కోసమే అన్నట్లుగా తన చేతిలోని వేణువును జారవిడచాడు. రాధ వెంటనే ఆ వేణువును పట్టుకునిపోయి, ఒక పొదరిల్లు చాటుకు వెళ్ళి దానిని యిలా ప్రశ్నించింది ...."నువ్వు ఇలా నిరంతరం గోవిందుని సాన్నిధ్యాన్ని పొందటానికి చేసిన గొప్ప పుణ్యమేమిటి?" అని.

దానికి ఆ వేణువు "ఓ రాధా! నేను ఎట్టి సాధనలు చేయలేదు. నాకు ఏమీ తెలియదు. నువ్వే చూస్తున్నావుగా, నాలో ఏమీ లేదు. ఒళ్ళంతా చిల్లులు గల ఒక వెదురు గొట్టాన్ని మాత్రమే. అయితే నేను ఇలా అంతా ఖాళీ చేసుకోవటమే ఆ పరమాత్మ సన్నిధికి చేర్చిన భాగ్యం! అంతేకాదు నిరంతరంగా ఆయన అధరామృతాన్ని గ్రోలుతూ కూడా కొంచెం కూడా నాలో దాచుకోకుండా వేణునాదంగా మార్చి విశ్వమంతటికీ పంచి పెడుతున్నాను. ఇది నేను చేసే సాధన" అని చెప్పింది.

అంతే కాదు, గొల్లవారైన బృందావన వాసులంతా ఇలాగే తమ మనస్సులను గుల్లగా చేసుకున్నారు. అందుకనే ఆ మనస్సులలో గోవిందుడు ప్రవేశించి, వాటిని తమకు అత్యంత ఇష్టమైన నివాసాలుగా మార్చుకున్నాడు. ఇలాగే మన మనసులను కూడా ఏ విషయాలు

లేకుండా (నిర్మల హృదయంగా) ఖాళీ చేసుకుంటే ఆ పరమాత్ముడు అందులో ప్రతిష్ఠితుడై బ్రహ్మానందంలో మనలను ముంచెత్తుతాడు. అటువంటి సద్భక్తులు ఆ ఆనందాన్ని కూడా తమలో దాచుకోకుండా ఆ వేణువులాగా లోకానికంతటికీ పంచిపెడతారు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

డిశంబర్ 2016

03 శని - శ్రీసద్గురుదేవులు స్వస్వరూపలయం పొందిన రోజు. సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

05 సోమ : సుబ్రహ్మణ్య షష్ఠి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

13 మంగ : పౌర్ణమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

23 శుక్ర శ్రీగురుదశమి, శ్రీసద్గురుపాదపూజ

25 ఆది : క్రిస్మస్ - ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

జనవరి 2017

01 ఆది : ఆంగ్ల సంవత్సరాది, ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

08 ఆది : ముక్కోటి ఏకాదశి. ఉదయం 11గం. సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

12 గురు : పౌర్ణిమ, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

13 శుక్ర : భోగి - ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, శ్రీబాబుకు భోగిపళ్ళుపోయటం, భక్తసమారాధన.

14 శని : మకర సంక్రాంతి, ఉత్తరాయణ ప్రారంభం, ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

22 ఆది : శ్రీ గురు దశమి, ఉదయం 11గం. సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

# ప్రవీరుని భక్తి

- పరాశర ప్రసాద్

ప్రవీరుడు మహిష్మతి నగరాధిపతి శ్రీనీలధ్వజుని పుత్రుడు. తల్లి జ్వాలాబాయి సాధ్వి, భక్తురాలు, వీరాంగన, స్వాభిమాని. పుత్రుడు ప్రవీరునిలో కూడా తల్లి లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఆ రోజుల్లో ధర్మరాజు రాజ్యపాలన చేస్తుండగా, శ్రీకృష్ణుని సలహామేరకు అశ్వమేధ యాగాన్ని తలపెట్టి అశ్వాన్ని విడిచిపెట్టి, దానివెంట రక్షణకై ధనుర్ధరుడైన అర్జునుడు, ఆయన సైన్యం బయలుదేరింది.

శ్రీకృష్ణభగవానుడు తాను రథసారథిగా అర్జునుని వెంట వెళ్లడానికి సిద్ధపడితే, 'ఈ చిన్న కార్యానికి నీవెందుకులే బావా!' అన్నాడు అర్జునుడు. అతనిలో పొడచూపిన మాయకు అంతరాయం కల్గించటం ఇష్టంలేక, సమయం వచ్చినప్పుడు సంస్కరిద్దాములే అని ఊరుకున్నాడు కృష్ణ భగవానుడు.

వీరుడైన అర్జునునితో తలపడే సాహసంలేకరాజులు, మహావీరులు అంతా ధర్మనందనుడి అశ్వానికి స్వాగతం పలికి, కానుకలు సమర్పించారు. ప్రవీరుని తండ్రి కూడా అర్జునునిపేరు విని అతనిని ఎదుర్కొనే సాహసం చేయలేదు. కాని ఆయన భార్య జ్వాలాబాయి తన భర్త పిరికితనానికి నొచ్చుకుని, తన కుమారుడైన ప్రవీరుణ్ణి ప్రోత్సహించింది. ప్రవీరుడు కూడా సందేహిస్తుంటే తానే స్వయంగా తలపడటానికి సిద్ధమైంది. అప్పుడు ప్రవీరుడు వెంటనే తల్లిమాటను శిరసావహించి, అశ్వాన్ని బంధించి, యుద్ధానికి సిద్ధమయ్యాడు.

ఆ మరునాడు ప్రవీరునికి, అర్జునునికి మధ్య హెూరాహెూరీగా యుద్ధం జరిగింది. ప్రవీరుని భార్య కృష్ణభక్తురాలు. శ్రీకృష్ణ భగవానుడు ప్రసాదించిన దివ్యాస్త్రాలు ప్రవీరుని దగ్గర ఉన్నంతవరకు ఎంతటి వీరుడైనా అతనిని జయించటం అసంభవం. అందువలన ప్రవీరుడు చేతిలో అర్జునుడు ఓటమి పాలయ్యాడు. ఆ అవమాన్ని భరించలేక అర్జునుడు వెంటనే 'హే గోవిందా! ముకుందా! శ్రీకృష్ణా! గోపాలా! మీరే నా సర్వస్వము. యజ్ఞానుష్ఠానానికి మీరే ప్రేరకులు కాబట్టి, ఈ యజ్ఞం నిర్విఘ్నంగా పూర్తి చేయించే బాధ్యత కూడా మీదే" అని ఆర్తిగా ఎలుగెత్తి ప్రార్థించాడు. మరుక్షణంలోనే అర్జునుని రథసారథిగా శ్రీకృష్ణుడు రథంలో దర్శనం ఇవ్వటం, ప్రవీరునికి ఎదుట మోహినీ రూపంలో దర్శనమిచ్చి, తాను ప్రసాదించిన ఆయుధాలను తన ప్రేమకు కానకుగా ఇవ్వమని

కోరితే తిరిగి ఇవ్వటం వలన ప్రవీరుడు అశక్తుడయ్యాడు. అదే సమయంలో మాయా ప్రలోభంలో పడి, మోహ కామావేశానికిలోనైన ప్రవీరుని శిరస్సును ఖండించమని అర్జునుని ఆదేశించాడు శ్రీకృష్ణభగవానుడు. భక్తుడైన ప్రవీరునికిగాని, అతని తల్లికిగాని, అతనిభార్యకుగాని అసంతృప్తి కలుగనీయకుండా ప్రవీరుణ్ణి పునర్జీవితుని చేయటానికి శ్రీకృష్ణుడు సంసిద్ధుడయినప్పటికీ, శ్రీకృష్ణసాయుజ్యాన్ని పొందిన ప్రవీరుని భాగ్యాన్ని తిరస్కరించటానికి వారు అంగీకరించలేదు.

శ్రీకృష్ణుడు రథసారథిగా ఉండగా అశ్వమేధయాగము విజయం సాధించకపోవటమనేది అసంభవం. అర్జునునికి విజయం, ప్రవీరునికి జన్మరాహిత్యం ప్రసాదించగల సమర్థత శ్రీకృష్ణభగవానునికే చెల్లు! అయితే అర్జునునిలో పొడచూపిన మాయను రహితం చేయటానికి, శ్రీకృష్ణ భగవానుని లీలా విశేషమే ఈ కథ.

## నిష్కాపట్యం

-శ్రీరామకృష్ణ పరమహంస

పసివాడి మాదిరి నిష్కపటివై ఉంటేగాని, నీకు తత్త్వ జ్ఞానం లభించదు. నువ్వు గడించిన లౌకిక జ్ఞానమంతా మరచిపోయి, ఆ విషయమై పసిబిడ్డ మాదిరి అజ్ఞుడవవు, అమాయకుడవవు. అప్పుడు నీకు తత్త్వజ్ఞానం లభిస్తుంది. అవలీలగా నరుణ్ణి నారాయణుని వద్దకు చేర్చేది నిష్కాపట్యం. రాళ్ళులేని చక్కగా సాగుచేయబడ్డ నేలలో విత్తనాలు సులువుగా అకుంరించి పెరిగి, ఫలించే తీరులో నిష్కపటచిత్తుడి మృదుల హృదయంలో తత్త్వబోధనలు చక్కగా నాటుకొని ఫలవంతాలౌతాయి. ఎవడైనా వుదారహృదయుడు, నిష్కపటచిత్తుడు అయివుంటే అది మహాతపోఫలమని బావించాలి. నిష్కపటి అయితేగాని నరుడు నారాయణుని కాంచలేడు. అమాయకులకే భగవంతుడు సాక్షాత్కరిస్తాడు.

కాని సత్యసంధత, అమాయకత్వం పేరుతో సాధకులు వెర్రివెంగళప్పలుగా పరిణమించకూడదని అందుకు శ్రీరామకృష్ణులు హెచ్చరికగా "నువ్వు భక్తుడవు కావాలిగాని, వెర్రివెంగళప్పవు కారాదు. సత్యమేదో, మిధ్య ఏదో, నిత్యమేదో, అనిత్యమేదో సదా మనస్సులో వివేచన చేస్తూ ఉండాలి. అప్పుడు అనిత్యమైన జగత్తును విడిచి నిత్యుడైన భగవంతుడి మీద మాత్రమే మనస్సును నిలపాలి.

(గత సంచిక తరువాయి) # యోగవాశిష్ఠము - సుషుమ్నా ప్రసాద

## వీతహవ్యుని కథ

వశిష్ఠ మహర్షి యిలా ప్రారంభించాడు "నేనిప్పుడు మోక్షమునకు దారితీసే మరొక మార్గాన్ని చెప్తాను రణధీరుడైన వో రామా! శ్రద్ధగా వినుము. వీతహవ్యుడను పేరు గల వొక గొప్ప తపస్వి పూర్వము వింధ్యపర్వతాలలో నివసించేవాడు. కొంత కాలానికా తపస్వి, తాను చేసే కర్మ కాండతో, అసంతృప్తికి లోనైనాడు, ఈ కర్మకాండ కేవలము చిరాకునకు లోనుచేసి, మానవుల కష్టాలకు, వ్యాధులకు కారణమవుతుంది.



అగ్ని పూజ చేసే, ఆ తపస్వి, అగ్నికాహుతి యిచ్చే తన సాధనను విరమించాడు, అతను నిర్వికల్ప సమాధిని సాధించాలను కొన్నాడు. అరటాకులతో, వొక కుటీరమును నిర్మించుకొని, అక్కడ జింక చర్మాన్ని, ఆసనంగా వేసుకొన్నాడు. అక్కడ పద్మాసనము వేసుకొని, రెండు చేతులను, రెండుమడమలపై పెట్టుకొన్నాడు, కనులు మూసుకొని, తన మనసును బాహ్య వస్తువుల నుండి అంతర్ముఖిం చేసుకొన్నాడు. తద్వారా మానసిక స్థిరత్వమును పొంది, క్రమేపి దానిని నిగ్రహించి స్థిరంగా భద్రంగా తన హృదయంలో నిలుపుకొన్నాడు".

తనలో తానిలా, ఆలోచించుకోటం ప్రారంభించాడు, "నా మనసును నిగ్రహించాను కాని ప్రాణం దానిని చికాకుపరుస్తుంది, అది ఎండిపోయిన ఆకులు గాలిలో యెగిరినట్లు గాలిలో యెగురుతున్నది. అది గుర్రపు స్వారీ చేసేవాడు గుర్రాలను తోలినట్లు బాహ్యేంద్రియములను పురికొల్పి, వాటిని వివిధ వస్తువులపై, పరుగిడేట్లు చేస్తుంది, కోతి వొక కొమ్మపై నుండి మరొక కొమ్మపైకి యెగిరినట్లు మనసు వొక వస్తువుపై నుండి మరొక వస్తువు పైకి పరుగిడుతుంది. ఎంతో ఆరాటంతో, కుతూహలంతో, వాటి వెంట పరుగిడుతుంది, జ్ఞానేంద్రియములు కేవలము మనస్సుకు ద్వారాల వంటివి నేను ఋషిని నేను నిశ్శబ్ధ సాక్షిని."

"ఓ ద్రోహంచేసే మోసకారి యింద్రియాలా మీ రెందుకు వృధాగా దుఃఖాలలో కష్టాలలో బంధింపబడుతారు? మీ రెందుకు బుద్ధి లేకుండ, అశాంతిగా దొర్లుతుంటారు? నేను స్వచ్ఛమైన అంతరాత్మను స్మృతిని (తెలివి) నేను మనసుతో, జ్ఞానేంద్రియములతో సాంగత్యము చేసి, పతనాన్ని కొనితెచ్చుకొన్నాను. సర్వజ్ఞత్వము గల ఆత్మకు నేత్రాలను, శ్రోత్రేంద్రియాలను గురించి బాగా తెలుసు కాని యీ యింద్రియాల కంతర్గతమైన ఆత్మను గురించి తెలియదు జ్ఞానమునకెప్పుడూ యింద్రియాలతో సన్నిహిత సాంగత్యములేదు."

"బ్రాహ్మణులు-అంటరాని జాతుల వారిలా, పిల్లి - ఎలుకలా, ముంగీస - పాములా, పరస్పరం విరుద్ధంగా వుంటాయి. ఓ మనసా! నీవెందుకు తిరుగుబోతు ఊరకుక్కలా, గమ్యం లేకుండ సంచరిస్తావు? ఓ దారి తప్పిన మేధస్సా! అహంకారముతో, నశించే శరీరాన్ని, నిత్యమైన ఆత్మగా పొరబడుతున్నావు. 'నేను'ను శరీరంతో, వస్తువులతో ఐక్యం చేసి కలవరపడకు అహంకారము యొక్క భ్రమ వలన వుత్పన్నమయ్యే భేద భావమును నిర్మూలం చేయి ఓ మనసా! సూర్యుని ముందు, అంధకార మదృశ్యమైనట్లు ఆత్మ విచారణ వలన, నీవదృశ్యమై పోతావు. ఓ మనసా! నీవు సత్య మార్గములో పయనించటానికి, నిశ్చయించుకొని, ఆత్మ విచారణ ప్రారంభించు ఇప్పుడనుసరించే మార్గము నిజంగా, అభినందించ తగ్గది. నీవు త్వరలో ఆత్మ యొక్క నిత్యానందము ననుభవిస్తావు."

ఇలాంటి ఆత్మ విచారణ ద్వారా వీతహవ్యుడు తన మనసును, యింద్రియములను, ప్రాణమును అదుపులో పెట్టి, అతను ముక్కు కొనమీద దృష్టినిలిపాడు. అతని శరీరము చలన రహితమయింది అతని శ్వాస ఆగింది, అతను మూడు వందల సంవత్సరాలు, వొక క్షణంలో గడిపేశాడు. భయానకమైన సింహాల గర్జన కాని, ఉరుము యొక్క భయానకమైన శబ్దముకాని, వేటగాళ్ళ యొక్క రంకెలుగాని, అతనిని సమాధి స్థితి నుండి, జాగృతం చేయలేపోయాయి.

- సశేషం

# ఉషస్తి

- రమణ ప్రసాద్

(ఛాన్దోగ్యోపనిషత్ ఆధారంగా)

ఆర్యసంస్కృతికి ఆలవాలమైన కురుదేశంలో ఒకసారి పాషాణ వర్షం కురిసి, దేశమంతా దుర్భిక్షం తాండవించింది. ఆ పరిస్థితులలో ఉషస్తి అనే ఋషి అన్నం లేక ప్రాణాలు నిలుపుకోవటానికి తన భార్యతో కలిసి గ్రామం విడిచి వేరే చోటుకు బయలుదేరాడు.

అలా పోతూ పోతూ ఏనుగులను పట్టి మేపి, వాటిని శిక్షించే వారి గ్రామానికి చేరుకున్నాడు. అక్కడ ఒక మావటివాడు అలచందలు తింటూ కనిపించాడు. ఆకలిబాధకు తట్టుకోలేక ఉషస్తి మహర్షి వాడిని తనకు కూడా కాసిని అలచందలు పెట్టమని కోరాడు. అందుకు ఆ మావటివాడు "మహాత్మా! మీరు బ్రాహ్మణులు! పూజ్యనీయులు! నా దగ్గర నేను తింటున్న ఎంగిలి అలచందలు మాత్రమే ఉన్నాయి. ఇవి మీకు ఎలా ఇవ్వగలను? నన్ను క్షమించండి" అన్నాడు.

దానికి ఉషక్తి "ఓ మావటివాడా! ఇప్పుడు నేను ప్రాణాలు కోల్పోయే స్థితిలో ఉన్నాను. కాబట్టి నాకు నీ ఎంగిలి అయినా ఫరవాలేదు ఇవ్వు" అని అడిగాడు. ఇక ఏమీ చేయలేక మావటివాడు వాటినే ఇచ్చాడు. వాటితోపాటు అనుపానంగా తన వద్దనున్న ఎంగిలి మంచినీరు కూడా ఇవ్వబోయాడు.

కానీ ఉషస్తి ఆ నీటిని స్వీకరించలేదు. అలచందలు మాత్రమే తిన్నాడు. పైగా "మావటీ! నువ్విచ్చే నీరు ఎంగిలి పాత్రలోది కాబట్టి, అవి త్రాగితే నాకు ఉచ్ఛిష్ట దోషం వస్తుంది. నాకు వద్దు" అన్నాడు. దానికి మావటివాడు "మరి నేను ఇచ్చిన అలచందలు ఎలా తిన్నారు? అవి ఎంగిలివే కదా?" అని అడిగాడు. దానికి సమాధానంగా ఉషస్తి "నువ్విచ్చిన అలచందలు తినకపోతే నా ప్రాణాలు నిలచేవి కావు. ప్రాణాలు నిలవటానికి వేరే మార్గం లేదు. ఆపద సమయంలో ఉచ్ఛిష్ట దోషం లేదు. కాబట్టి తిన్నాను. నీరు అలాకాదు. త్రాగే నీరు యథేష్టంగ లభిస్తుంది. కాబట్టి యీ నీవిచ్చే నీరు త్రాగరాదు" అన్నాడు.

ఇలా చెప్పి ఉషస్తి మావటి ఇచ్చిన అలచందలు కొన్నితిని, తన ప్రాణాన్ని నిలబెట్టుకుని, కొన్నిటిని తన భార్యకు తినమని ఇచ్చాడు. కాని ఆమె వాటిని తినకుండా తన భర్తకోసమే దాచిపెట్టింది.

మరునాడు ఉదయం సమీపంలోని రాజు ఒక యాగం చేస్తున్నట్లు ఉషస్తికి తెలిసింది. యాగానికి వెడితే సంభావన వస్తుంది,

కష్టం గడిచిపోతుంది అనుకున్నాడు. కాని నడిచేదెట్లా? కొన్ని రోజుల నుండి తిండిలేక శరీరం శుష్కించి, జవసత్వాలు ఉడిగిపోయి నడిచే శక్తి లేదు. నిన్న ఆ గజపాలకుడు అలచందలు పెట్టకపోతే అసలు అతని ప్రాణాలే నిలిచేవికావు. "ఇప్పుడు ఎవరైనా అంత తిండిపెడితే నడవ గలుగుతాను. రాజు దగ్గరకి వెళ్ళి యాగంలో పాల్గొని దక్షిణ సంపాదిస్తా" అన్నాడు తన భార్యతో.

ఆ మాటలు విన్న భార్య తాను దాచి ఉంచిన అలచందలను తెచ్చి భర్తకిచ్చింది. అవి తిని నడక సాగించాడు మెల్లగా. అలా యాగస్థలం చేరిన ఉషస్తి "సద్యోమండపం యొక్క నడుమ ఉద్గాతృగణానికి సమీపంలో ఆశీనుడై ఉన్న యాగంలోని ప్రస్తోతతో యిలా అన్నాడు "ఓ ప్రస్తోతా! ప్రస్తావ భక్తి విషయంలో ఏ దేవతా స్వరూపం ఉపాస్యరూపంగా ప్రసిద్ధమై ఉన్నదో ఆ దేవతా స్వరూపాన్ని నీవు ఎరిగి ప్రస్తావ గానాన్ని చెయ్యి. అలాగాక - ఆ దేవతా స్వరూపం తెలుసుకోకుండా ప్రస్తావగానం చేశావో నీ తల వేయి ముక్కలవుతుంది!" అన్నాడు.

అలాగే ఉద్గాతతో "ఓఉద్గాతా! ఉద్గీథ భక్తి విషయంలో ఏ దేవతా స్వరూపం ఎరిగి ఉద్గీథ గానాన్ని చెయ్యి. అలాగాక గానం చేస్తే నీ తల నేల రాలుతుంది!" అని శాపవచనాలు పలికాడు.

ఆ తరువాత ప్రతిహోర్తవైపు తిరిగి "ఓ ప్రతిహోర్తా! ప్రతిహోర్త భక్తి విషయంలో ఏ దేవతా స్వరూపం ఉపాస్యమో ఎరిగి నువ్వు ప్రతిహోర గానం చెయ్యి. అలాగాక గానం చేశావో నీ తల నేల రాలుతుంది" అన్నాడు.

ఉషస్తి యొక్క ఈ శాపవచనాలు విన్న ప్రస్తోత, ఉద్గాత, ప్రతిహోర్తలు ముగ్గురూ సదరు దేవతా స్వరూపాలు తెలియనందున తమ తలలు నేల రాలతాయోమో అన్న భయంతో ఆయా తమ క్రియలను చాలించి నిరుత్తరులైనారు.

జరుగుతున్నదంతా చూసిన యజమానుడైన రాజు, ఉషస్తిని ఉద్దేశిస్తూ "పూజనీయా! తమరెవరు? తమ విషయం తెలుసుకోవాలని వుంది. కాబట్టి మీ పరిచయభాగ్యం కలిగించండి" అని అడిగాడు. అప్పుడు ఉషస్తి మహారాజుతో "నేను చక్రఋషి గోత్రీయుణ్ణి. నా నామధేయం ఉషస్తి" అన్నాడు.

ఉషస్తి పేరు వినగానే రాజు ఎంతో వినయంతో "ఓ పండితోత్తమా! సర్వగుణ సంపన్నులైన తమరిని నా యాగానికి పెద్దగా చేసుకోవాలని తలచి మీ కోసం మీ నివాసస్థానానికి ఆహ్వానం పంపాను. కాని కరువు కాటకాల వల్ల మీరు ఆ ఊరు విడిచి ఎటో వెళ్ళారని

తెలిసింది. మీకోసం అన్నివైపులా వెతికించాను. మీ ఆచూకి తెలియక వీరిని యాగపెద్దలుగా నియమించాను. పరిపూర్ణ జ్ఞానులైన మీరు యీ యజ్ఞంలో పెద్దగా ఉండి యాగాన్ని సమగ్రంగా నడిపించమని ప్రార్థిస్తున్నాను" అని వేడుకొన్నాడు.

అందుకు సమ్మతించిన ఉషస్తి "ఈ యాగ విషయంలో సర్వ దేవతా స్వరూపాన్ని సమగ్రంగా ఎరిగిన నేను పెద్దగా ఉంటాను కాబట్టి ఈ ఋత్విజులు ఇలాగే తమ తమ విధులను నిర్వర్తించనీ, వారికెలాటి దోషం కలుగదు. సమర్పించవలసిన దక్షిణలు అన్నీ వారికే ఇవ్వు. కాని వారందరికీ కలిపి ఎంత యివ్వలాని నిర్ణయించావో అంత నాకూ యివ్వాలి" అన్నాడు. అందుకు రాజు అంగీకరించాడు.

ఆ తరువాత ప్రస్తోత తన వ్యాకులతను విడిచి, వినయంతో మహర్షి ఉషస్తిని సమీపించి "ఓ ఋషీశ్వరా! నన్ను గురించి మీరు ఏ శాపవాక్యం పలికారో ఆ ప్రస్తావ భక్తి విషయక దేవతా స్వరూపాన్ని గురించి నాకు తెలియజేయండి" అని అడిగాడు.

ఉషస్తి ప్రస్తోతకు ఉపదేశిస్తూ ................ "ప్రస్తావ భక్తి విషయక ఉపాస్యదేవత ప్రాణం. అంటే ప్రాణోప లక్షిత పరమాత్మ అని అర్థం. ఈ సమస్త భూతాలు ఈ ప్రాణంలోనే ప్రవేశించి లయం చెందుతాయి. కాబట్టి సర్వభూత లయోత్పత్తులకు ఆధారమైన యీ ప్రణస్వరూప దేవతే ప్రస్తావ భక్తి విషయక దేవతయై ఉపాసింప బడుతోంది" అన్నాడు.

తరువాత ఉద్గాత ప్రశ్నించగా ఉషస్తి "ఆదిత్యుడే ఉద్గీథ భక్తికి ఉపాస్య దేవత. సుప్రసిద్ధాలైన యీ సమస్త భూతాలు ఆదిత్య దేవతనే వున్నతుడైన వానిగా  స్తుతిస్తున్నాయి. అలా సూర్యమండలం మధ్యలో సర్వాభాసక స్వర్ప్రకాశరూపమై, పరబ్రహ్మ స్వరూపమై, అత్యున్నత స్థితి కలిగిన ఆ ఆదిత్యదేవతా స్వరూపమే ఉద్గీథ ప్రణవంలో ఉపాస్యమై వుంది" అన్నాడు. ఆ తరువాత ప్రతిహోర్త ఋషిని ప్రశ్నించగా "ప్రతిహోర్తా! ప్రితహోర భక్తి విషయక దేవత అన్నం. సమస్త భూతాలు అన్నమే తిని జీవిస్తున్నాయి. 'అద్యతేత్తిచ భూతాని' అని సర్వాధారభూతమైన యీ అన్నదేవతే ప్రతిహోర కృత్యాన్ని అధిగతమై వ్యాపించి ఉన్నది. కాబట్టి యీ అన్నదేవతే ప్రతిహోర్తకు ఉపాస్యం" అని ఉపదేశించాడు.

ఈ విధంగా ఆ యాగాన్ని సమగ్రంగా, శాస్త్రీయంగా పూర్తి చేసి అందరూ రాజువద్ద అపార దక్షిణలు స్వీకరించి తమతమ నివాస స్థానాలకు చేరుకుని, కరువు బాధనుండి విముక్తులయ్యారు.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

డిశంబర్ 2016

3 శనివారం : ఆంగ్లమానం ప్రకారం శ్రీసద్గురుదేవులు స్వస్వరూప లయం పొందిన రోజు. ఉదయం 11గం.లకు శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

5 సోమ : సుబ్రహ్మణ్య షష్ఠి

10 శని : గీతా జయంతి - ఉదయం 9॥ గంలకు శ్రీమద్భగవద్గీత పారాయణ.

13 మంగ : పౌర్ణమి, శ్రీ సద్గురు పాద పూజ. శ్రీదత్తాత్రేయ జయంతి.

16 శుక్రవారం నుండి ధనుర్మాస ప్రారంభం.

23 శుక్రవారం శ్రీగురుదశమి. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

25 ఆది : క్రిస్మస్ - శ్రీసద్గురుపాదపూజ.

27 మంగ : మాస శివరాత్రి. , పావులూరు శాఖలో ఏకాహం

29 గురు : అమావాస్య.

జనవరి 2017

01 ఆది : ఆంగ్ల సంవత్సరాది, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

08 ఆది : ముక్కోటి ఏకాదశి. శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

12 గురు : పౌర్ణిమ, శ్రీ సద్గురు పాద పూజ.

13 శుక్ర : భోగి -భోగి పండుగ, శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన. రాత్రి 8గం. శ్రీబాబుకు భోగిపళ్ళు

14 శని : మకర సంక్రాంతి, ఉత్తరాయణ ప్రారంభం, శ్రీ సుద్గరు పాద పూజ, భక్త సమారాధన.

15 ఆది : కనుమ

22 ఆది : శ్రీ గురు దశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

26 గురు : మాస శివరాత్రి, రిపబ్లిక్ డే, పావులూరులో ఏకాహం

27 శుక్ర : అమావాస్య.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

ఒక భక్తుడు తాను ఎంతకాలం నుంచో ధ్యానం చేస్తున్నా మనస్సు నిలబడటం లేదన్న అంశాన్ని పురస్కరించుకుని సద్గురుదేవులు మాట్లాడుతూ శ్రీరమణమహర్షి ఉదంతాన్ని వివరించారు.



శ్రీ రమణుని ఒక భక్తుడు ప్రశ్నిస్తూ 'తమ అనుగ్రహాన్ని పొందాలని ఎంతకాలం నుంచో ప్రయత్నిస్తున్నాను. తమరు అనుగ్రహించక పోతే నా గతిఏమిటి?' అన్న వెంటనే శ్రీరమణులు సమాధానం చెబుతూ 'నా అనుగ్రహం సర్వకాల సర్వావస్థలయందు వర్షిస్తూనే ఉంది. దానిని అందుకోలేకపోతే నేనేమి చేయగలను?' అన్నారు.

"చూశారా! తప్పు తనలోపెట్టుకుని సద్గురుమూర్తిపైన నిందలు వేస్తారు. అది మానవ స్వభావం. దానికి మూల కారణం విషయాదులతో పరాధీన మనస్సుని స్వాధీపరచుకోవటం కష్టం. విషయాదుల నుంచి అంత తేలికగా విడదీయటం సాధ్యం కాదు.

మనస్సుని సమాధానపరచుకునే నేర్పరితనం కావాలి. విషయాదుల మోహం చేతమనస్సుకి సత్యమార్గం గోచరించదు. మనస్సు భావనలోమార్పు రానంతవరకు ప్రయోజనం లేదు. మనస్సే హెచ్చరిస్తోంది, "ఇంతకాలం నన్ను విషయాదుల మీదకి పంపి ఊరించి, నా ద్వారా వాటిని అభిమానించి, ఈ స్థితికి చేరుకున్న తరువాత నేనేమి చేయగలను" అంటుంది.

మనస్సు విషయాదులతో భోగిస్తున్నట్లు సంకేతం ఆకలిదప్పులకి, శోకమోహాలకు, జననమరణాలకు గురికావటమే. నీ మనస్సు అంతర్ముఖం కానంతవరకు నువ్వు చేసే పూజలుగాని, సంకీర్తనగాని, అలంకరణగాని, పారాయణగాని కేవలం కృత్రిమంగానే ఉంటాయి. వాటి అనుభూతిని నువ్వు పొందలేవు సుమా" అని హెచ్చరించారు.

మరి దీని నుండి విముక్తిని పొందే మార్గం లేదా అంటే ఉంది. సద్గురుమూర్తి సమాశ్రయంలో మనస్సు అర్చన, పూజ, అలంకరణ,

పారాయణ ఉపాసనలతో ప్రవేశాన్ని కల్పించాలి. గురుబోధ శ్రవణం మననం ద్వారా మనస్సులో సత్సంకల్పం కలుగుతుంది. అదే శుభేచ్ఛ. అది జ్ఞాన మార్గంలో పయనించటానికి శ్రేయస్సు అనే సౌధాన్ని అధిరోహించటానికి ప్రథమ సోపానం.

'నేనెవరు?' అనేది విచారణ చేయాలి. 'నేను' అనేది సుఖమై, శాంతమై, అనంతమై, శుద్ధమై, నిత్యమై, సత్యమై, సర్వవ్యాపకమై బుద్ధిచేత తెలియనిదై, బుద్ధిని ప్రకాశింపజేసేది సుమా" అన్నారు శ్రీగురుదేవులు.

దానిని ఎవరైనా దర్శించారా? దర్శించగలవారున్నారా? అని ప్రశ్నించారు. దానికి గురుసంస్కారం ఉంటే సాధ్యపడుతుంది. ఎందువలనంటే మనస్సు అంతర్ముఖమైనప్పుడే అది సాధ్యమవుతుంది. 'మనసా అభిక్లుప్తః' అన్నట్లుగా అది అభిముఖం అవ్వాలి.

మనస్సు మేల్కొంటే బహిర్ముఖమై ఇంద్రియాలను దేహాన్ని చూస్తుంది. పనిలేని మనస్సు నిదురలోకి జారిపోతుంది. మేల్కొన్న మనస్సు క్రియను చేస్తుంది. మరి అభిముఖం అవ్వటమెలా? దానికి విచారణ అనే ఆహారం సద్గురుమూర్తి ద్వారా అందజేయాలి. విచారణ ద్వారా పొందే అనుభూతే సాక్షాత్కారము.

## *సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి*

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా డిసెంబరు 2016, జనవరి 2017 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

డిసెంబరు 2016: AS 2990, 2991, 4091, 4953, 6373, 6467, 6473, 6982
AS 7104, 7193, 7196, 7197, 7201, 7202, 7203, 7204,
AS 7205

జనవరి 2017: AS 0405, 2421, 2631, 4869, 4952, 5127, 5414, 5490, 6327,
AS 6454, 6478, 6508, 6509, 6514, 6515, 6516, 6824, 6825,
AS 6990, 6992, 7206 to 7216, 6823

– మేనేజర్

# అర్జునుని కృష్ణ ప్రేమ

సేకరణ - మురళీ

(వార్తాలాపము నుండి)

కృష్ణుడికి ఎప్పుడూ అర్జునుడి దగ్గరకు వెళ్ళాలని ఉండేది. ఇది రుక్మిణీదేవికి చాలా కష్టంగా ఉండేది. ఆమె చాలాసార్లు "నాథా! తమకు అన్నివిధాల సేవచేయటానికి నేను సిద్ధంగా ఉన్నాను కదా. అయినే సరే మీరు నిత్యము అర్జునుని వద్దకే వెడుతున్నారు. అర్జునునిలో ఉన్న ఆ గొప్పతనం ఏమిటి?" అని ప్రశ్నించింది. కృష్ణుడు మౌనం వహించాడు.

ఒకరోజున కృష్ణుడు ఎప్పటిలాగానే అర్జునుడి వద్దకు బయలు దేరాడు. ఆ రోజు యాదవులంతా కూడా కృష్ణుని సహాయంకోరి ఎక్కడకూ వెళ్ళవద్దని కోరారు. ఆరోజునే అంతఃపురంలో కూడా ఏదో ప్రత్యేక కార్యక్రమం ఉండటం చేత రాణులందరూ కూడా బయటకు వెళ్ళవద్దని బ్రతిమి లాడారు. అయినాసరే కృష్ణుడు అర్జునుడి దగ్గరకు వెళ్ళిపోయాడు.

కృష్ణుడు వెళ్ళేసరికి అర్జునుడు అప్పుడే వేట నుండి తిరిగి వచ్చి, మంచం మీద అలసిపోయి పడుకుని విశ్రాంతి తీసుకుంటున్నాడు. ద్రౌపది అతని తడిసిన కేశములను సవరిస్తున్నది. ద్రౌపది కృష్ణుని రాకతో అతిథి మర్యాదకై లోపలికి వెళ్ళింది. ఇంతలో కృష్ణభగవానుడు అర్జుని ప్రక్కనే కూర్చుని అతని కేశములను విడదీయ సాగాడు.

ఎంత పట్టుదల పట్టినా అగకుండా వచ్చిన కృష్ణుడు ఏం చేస్తున్నాడో చూడాలని కోపంతో రుక్మిణీదేవి కూడా అక్కడకే వచ్చింది. అక్కడ కృష్ణుడు అర్జునుని కేశములు విడదీయటం చూసి రుక్మిణికి కోపం అధికమైనది.

కృష్ణుడు రుక్మిణితో అర్జునునికి నిద్రాభంగం చేయవద్దని సైగ చేసి, ఆమెను కూడా అతని కేశములను ఆరబెట్టమని ఆజ్ఞాపించాడు. రుక్మిణి చేసేది లేక అయిష్టంగానే ఆ పనికి ఒప్పుకుని, అతని కేశములను ఆరబెడుతుండగా, కృష్ణభగవానుడు అర్జునుని కేశములను రుక్మిణీదేవి బుగ్గలకు స్ప ృశింప జేశాడు. ఆమెకు అర్జునుని ప్రతి కేశము నుండి 'కృష్ణా! కృష్ణా!' అనే నామము వినిపించినది. అప్పుడు రుక్మిణికి అర్జునుడికి కృష్ణుడి మీద ఉన్న అపూర్వమైన ప్రేమ, భక్తి అర్థమైనంతనే, అప్పటిదాకా తనకు మాత్రమే కృష్ణుడిపై ఎంతో ప్రేమకలదు అనే అహంకారం నశించి, మిక్కిలి సిగ్గుపడింది.

# అనింద్యునిపై గణపతి విజయం

(గత సంచిక తరువాయి) - రావి శోభ

అంతలో కుబేరుడు కల్పించుకుని "అమ్మా! జగన్మాతా! అమ్మల గన్నమ్మా! సకల చరాచర జీవకోటికి అమ్మవు! నాకూ, నా కుమారుడికి కూడా మాతవు! నా పుత్రుడు దుడుకుగా ప్రవర్తించాడు. అందుకు నేను క్షమాపణ చెప్పుకుంటున్నాను" అని వేడుకున్నాడు.

"ఎవరికైనా, ఎంతటివారికైనా శాపఫలాన్ని అనుభవించక తప్పదు. కనుక నీ పుత్రుడు అసుర జన్మను ఎత్తుతాడు. కానీ ఎవరైతే నీ కుమారుణ్ణి ఎదిరించి, ఇతని రాక్షసప్రవృత్తికి కారణమైన, కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలను సంహరిస్తారో, ఆ పుణ్యమూర్తి చేత జయింప బడి, అతనికి దాసోహమైనప్పుడు నీ కుమారుడికి శాపవిముక్తి కలుగుతుంది. అప్పుడు అసుర జన్మ అంతమై సహజ జన్మ లభిస్తుంది" అని శాపవిమోచనం చెప్పింది జగదీశ్వరి.



కొంతకాలానికి ఆ శాప ప్రభావం చేత అనింద్యుడు మూషికాసురుడిగా జన్మించాడు. త్రిలోక పుణ్యత సాధించటం కోసం విఘ్నరాజుని ఎదిరించటానికి కావలసిన శక్తి సామర్థ్యాలు సంపాదించటానికి బ్రహ్మ కొరకై తపస్సు చేయటం ప్రారంభించాడు. అతని తపస్సుకి ముల్లోకాలు కంపించిపోయాయి. బ్రహ్మదేవుడు దిగి వచ్చి దర్శనమిచ్చాడు. మూడు వరాలు కోరుతూ ... "1. నాకు త్రిలోక పూజ్యత లభించాలి. 2. నేను చిరంజీవిని కావాలి. 3. దేవతల వలనగానీ, మానవుల వలనగానీ, ఏ ఆయుధం చేతగానీ, ఏ అస్త్ర శస్త్రం చేతగానీ, జంతువుల వలనగానీ, స్త్రీ చేతగానీ, కోరలు, గోళ్ళ వలనగానీ నాకు హానీ, మరణం రాకూడదు" అన్నాడు మూషికాసురుడు. 'తథాస్తు!' అని వరమిచ్చాడు బ్రహ్మదేవుడు!

ఇలా విధాత ద్వారా వరాన్ని పొందిన మూషికాసురుడు ముల్లోకాలపై తన అసురసైన్యంతో దండెత్తి తన వశం చేసుకున్నాడు. తనలోని అసుర గుణాలను ప్రేరేపించి, వాటిని ఆవాహన చేసి, ఒక్కొక్క

అసురగుణాన్ని, ఒకొక్క అసురుడిగా మార్చి, త్రిలోక పూజ్యుడు కావటానికి, వినాయకునిపై విజయం సాధించటానికి యుద్ధాన్ని ప్రకటించాడు మూషికాసురుడు.

విఘ్నేశ్వరుడుకి, మూషికాసురుడికి మధ్య జరిగిన యుద్ధంలో మూషికాసురుడి నుండి ఉద్భవించిన 'అష్ట అసుర గుణాలు' 'అష్ట అసురులు"గా చెలరేగి చివరికి, ఆ మహాగణపతికి విధేయులు కాగా, నిస్తేజుడు, నిస్సహాయుడు, నిర్గుణుడు అయిన మూషికాసురుడు కర్తవ్యం తోచక నిర్విణ్ణుడయ్యాడు. అప్పుడు అతని పరిస్థితిని గమనించిన ముల్లోక వాసులూ మరింత ఉత్సాహంతో మహాగణపతికి జయ జయ ధ్వానాలు పలికారు.

మాహగణపతి మూషికాసురునివైపు చూస్తూ "ఓరీ! నీలోని శక్తులన్నీ నన్ను శరణుకోరి, నిన్ను నిరాధారుడిగా, నిస్సహాయుడిగా చేశాయి" అంటున్న గణపతితో, మూషికాసురుడు లేని ధైర్యం తెచ్చుకుని "ఓ గణేశా! ముల్లోకాలలో నన్నెవరూ జయించలేరు. నీవు సమర్థుడవైతే నీ ముందున్న దేవతాగణాలను కాపాడుకో!" అంటూ పరిహసించి, అమోఘమైన దివ్యాస్త్రాలను ఊర్ధ్వలోకాలపైకి ప్రయోగించాడు. అవి పరమేశ్వరుని పాశుపతాస్త్రాన్ని మించి, విష్ణువు యొక్క నారాయణాస్త్రాన్ని మించి, ఆదిశక్తి త్రిశూలాన్ని మించి ప్రచండ ప్రళయాగ్ని జ్వాలలు కక్కుతూ త్రిజగాలనూ చుట్టుముట్టి దహించసాగాయి. అది గమనించిన మూషికాసురుడు "విన్నావా గణనాధా! నీ ఆశ్రితుల ఆర్తనాదాలు? నేను ఎవరిననుకుంటున్నావు? బ్రహ్మవర ప్రసాదితుడను. నాకు దేని వల్ల కూడా మరణం లేకుండా వరం పొందాను అని చెబుతుండగా, అంతరిక్షంలో నుండి నారదుడు నొచ్చుకుంటున్నట్లుగా నటిస్తూ "కొంప ముంచావయ్యా! మూషికాసురా! అన్నిటి నుండి నువ్వు వరాలు పొందావు గానీ, గజాననుడికి అలంకారము, మహాశక్తివంతమైన దంతంతో చావు లేకుండా నువ్వు వరం కోరుకోలేదుగా! అమ్మ సమక్షంలో జ్ఞానామృత పానం చేసి కూడా, ఆవిడ శాపం వల్ల ఆ జ్ఞానం నీకు ఉపకరించక, అజ్ఞానివై అసంపూర్ణ వరం కోరుకున్నావు" అన్నాడు. ఆ మాటలు విని మూషికాసురుడు నిర్విణ్ణుడయ్యాడు!!

-సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

(గత సంచిక తరువాయి)

కన్నయ్య నవ్వుతూ ఎదురువచ్చి, "గాలివస్తే పొగడపూలు కొద్ది కొద్దిగా రాలతాయిగానీ, పారిజాతం కొమ్మలు కదిపితే పూలు అంతకన్నా జలజల పడతాయి. అలాగ నేనే చెట్టుచాటున ఉండి, పూలు మీపై రాల్చానని మీరు గ్రహించలేకపోయారు. ఈసారి కూడా గెలుపు నాదే!" అంటున్న కన్నయ్యతో గోపికలు బిక్కమొహాలుపెట్టి, "ఆటలలోనూ నీదే గెలుపు. మరి పాటలలో సరేసరి. విద్యాధిదేవత సదా నీ సేవలోనే ఉంటుంది కదా. మరి మాకు దిక్కెవరు? నీవే కదా జగన్నాథా! కనికరించి మాకు కూడా ఒక సారి గెలిచే అవకాశం ఇవ్వరాదా?" అని ప్రార్థించే సరికి కన్నయ్య కరిగిపోయి 'సరే' అన్నాడు.



"రేపు ఇక్కడే మరల సమావేశం జరిపి, వివరాలన్నీ విందురుగాని అందరూ రండి" అన్నాడు కన్నయ్య వీడ్కోలు చెబుతూ.

మరునాడు అదే సమయానికి, అదే స్థలంలో గోపకాంతలు అందరూ నిలబడి ఉన్నారు.

కన్నయ్య మాట్లాడుతూ "నిన్న పగలు మా మందలోని గోవు ఒకటి తప్పిపోయింది. దాన్ని వెతుక్కుంటూ వచ్చేసరికి చాలా ఆలశ్యం అయింది. చాలా అలసిపోయాను. (ఒక గోపికవైపు చూపిస్తూ) ఇదిగో యీమె యింటికి వెళ్ళి మెల్లగా ముని వేళ్ళతో తలుపు తట్టాను. లోపలి నుండి కాస్త గద్దించి నన్ను 'ఎవరు?' అని అడిగింది" అంటూ "ఇక ఆమె నోటితోనే వినండి మిగిలిన విషయాన్ని" అని విరమించాడు.

గోపిక చెప్పసాగింది.... "ఓసీ! వంకర ఆలోచనలు చేసేదానా! కుటిలా! నేను మాధవుడినే" అన్నాడు కృష్ణుడు. "మాధవుడు అంటే వసంతుడు అని కూడా అర్థం ఉన్నది కదా! అయితే నీవు వసంతుడివా?" అన్నాను. "కాదు కాదు వసంతుడను కాను, నేను చక్రిని" అన్నాడు కన్నయ్య. "అయితే చక్రం త్రిప్పి కుండలు చేసే కుమ్మరివా?" అన్నాను. "కాదే, ధరణీధరుడను" అన్నాడు. "భూమిని మోసే రెండు నాలుకలుగల

సర్పరాజైన ఆదిశేషుడివా?" అన్నాను. "కానేకాదు. భయంకరమైన పాముని మర్ధించిన వాడను నేను" అన్నాడు. "అయితే పాములకు విరోధియైన పక్షిరాజు గరుత్మంతుడివా?" అన్నాను. "కాదు. నేను హరిని" అన్నాడు కన్నయ్య. "అయితే నువ్వు వానరరాజువా?" అన్నాను నేను.

ఇదంతా చెప్పి గోపిక "నేను ఈ విధంగా బదులుమాట చెప్పగా నందనందనుడు తాను ఓడిపోయానని ఒప్పుకున్నాడు నా దగ్గర" అని చెప్పింది.

దుష్టులను శిక్షించేందుకు చక్రం ధరించిన ఆ చక్రపాణి మనలను రక్షించుగాక!! దయానిధి అయిన గోపబాలుడు తనను నమ్మినవారిని గెలిపించి, గోపికల మనస్సులను రంజింపజేసాడిలా!!!

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

డిశంబర్ 2016

13 మంగ : పౌర్ణమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

16 శుక్రవారం నుండి ధనుర్మాస ప్రారంభం. - నెలరోజులు ఉదయం 5గం.లకు శ్రీసద్గురుపాదపూజ; ; నగరసంకీర్తన. తిరుప్పావై; ముకుందమాల పారాయణ.

డిసెంబర్ 23 శుక్ర: శ్రీగురుదశమి. రాత్రి7గం. శ్రీ సద్గురుపాదపూజ.

జనవరి 2017

12 గురు : పౌర్ణిమ, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

13 శుక్ర : భోగి -రాత్రి 7గం.లకు శ్రీ సద్గురుపాదపూజ, భోగిపళ్ళు.

14 శని : మకర సంక్రాంతి, ఉత్తరాయణ ప్రారంభం, రాత్రి 7గం.లకు శ్రీ సద్గరు పాద పూజ.

22 ఆది : శ్రీ గురు దశమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

# వసిష్ఠుడు

- రమణ ప్రసాద్

వసిష్ఠుడు సప్త మహర్షులలో ఉత్తముడు. ఇక్ష్వాకు వంశ క్షత్రియులకు కుల గురువు. త్రిలోక పూజ్యురాలైన అరుంధతికి ప్రాణ నాథుడు. బ్రహ్మ తనకు సృష్టి కార్యంలో సహాయపడటం కోసం భృగువు,పులస్త్యుడు, పులహుడు, క్రతువు, అంగీరసుడు, మరీచి,దక్షుడు,అత్రి,వసిష్ఠులు అని తొమ్మిదిమంది తనతో సమానమైన సరియైన ప్రజాపతులను సృష్టించాడు. వారిని నవబ్రహ్మ లనికూడా అంటారు. వసిష్ఠుడు దక్షుని పుత్రిక అయిన 'ఊర్జ'ని వివాహం చేసికొని ఆమె వలన విరజుడు, గోత్రుడు, ఊర్ధ్వబాహు డు, సవనుడు, అనఘుడు, సుతవుడు, శక్రుడు అను ఏడుగురు  పుత్రులను పొందాడు. వారు వుత్తమ మన్వంతరంలో సప్తఋషులుగా విలసిల్లారు.



ఒకనాడు ఇక్ష్వాకు వంశపు రాజు వసిష్ఠుని ఆహ్వానించి, "మహాత్మా! ఇకనుంచి  మీరు మా కుల గురువుగా ఉండి మా వంశ సంక్షేమాన్ని కోరండి" అని ప్రార్థించగా అందుకు  వసిష్ఠుడు తన అంగీకారాన్ని తెలిపాడు. వసిష్ఠుడు బాహ్యేంద్రియ వ్యాపారములను వర్జించి, బ్రహ్మ వద్దకు చేరి, తాను శరీర త్యాగం చేదలుచుకొన్నానని తెలుపగా శ్రీమన్నారాయణుడు రాముడిగా అవతరింబోతున్నాడని, అతనికి అతని తమ్ములకు కులగురువుగా వ్యవహరించమని చెప్పగా వసిష్టుడు తన శరీర త్యాగం చేయటం మానుకున్నాడు. కొంతకాలానికి ఇక్ష్వాకుడు దివంగతుడు కాగా అతని కుమారుడైన నిమి రాజ్యానికి వచ్చి వసిష్ఠుని ఎంతగానో గౌరవిస్తున్నాడు.

కొంత కాలానికి నిమి సత్త యాగం చేయాటానికి సంకల్పించి వసిష్ఠుని యజ్ఞ హోతగా ఉండమని ప్రార్థించాడు. వసిష్ఠుడు," నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కాని ఇంద్రుడు చేసే యజ్ఞానికి హోతగా ఉండేందుకు నేను మాట ఇచ్చి ఉన్నాను. ఆ యజ్ఞం పూర్తి కాగానే నీ

క్రతువును ఆచరిస్తాను” అన్నాడు. కాని నిమి గౌతమ మహర్షిని హోతగా పెట్టి యజ్ఞం చేయటం మొదలు పెట్టాడు. ఇంద్రుని యజ్ఞం పూర్తి కాగానే వసిష్ఠుడు నిమి యజ్ఞానికి హోతగా ఉందామని వచ్చి, అక్కడ గౌతముడి ఆధ్వర్యంలో యాగం జరగటం చూసి , కోపంతో, “నాకు చెప్పకుండా యాగం ప్రారంభించావు కనుక నువ్వు విదేహుడవగు గాక” అని శపించాడు. నిమికూడా కోపంతో వసిష్ఠుని “విదేహుడగుదువు గాక” అని ప్రతి శాపం ఇచ్చాడు. గౌతమాదులు, దేవతలు నిమి శరీరాన్ని సంరక్షించి యాగాన్ని పూర్తి చేశారు. వసిష్ఠుడు విగత దేహుడై తన యోగ విద్యలను మిత్రా వరుణులకు ప్రసాదించాడు. అనంతరం ఊర్వసిని చూసిన మిత్రా వరుణుల వీర్యములు స్ఖలితంకాగా , ఊర్వసి దానిని ఒక కుండలో భద్ర పరిచింది. అందులోనుంచి వసిష్ఠుడు, అగస్త్యుడు దేహధారులుగా వచ్చినందువల్ల వసిష్ఠుడిని కుంభసంభవుడని పిలుస్తారు.

కర్దమ ప్రజాపతికి దేవహూతికి తొమ్మిది మంది కుమార్తెలు ఉదయించారు. వారిలో అరుంధతి ఒకర్తె. కర్దమ ప్రజాపతి తన కుమార్తెలను బ్రహ్మర్షులకే ఇచ్చి వివాహం చేయాలనే నిశ్చయంతో ఉన్నాడు. ఒకనాడు వసిష్ఠుడు కర్దమ ప్రజాపతి ఇంటికి వచ్చాడు. కర్దముడు అతడిని సగౌరవంగా ఆహ్వానించాడు. వసిష్ఠుడు అక్కడ అరుంధతిని చూసి దివ్యదృష్టితో ఆమెయే తన భార్య అని గ్రహించినవాడై ఆమె మహాత్మ్యమును పరీక్షించాలనుకొన్నాడు. ఆయన కొంత ఇసుక తెచ్చి “దీనిని వండి పెట్టగలవారున్నారా?” అని ప్రశ్నించగా అరుంధతి “నేను వండి పెట్ట గలను” అని ఆ ఇసుక రేణువులను త్రాకి వాటిని బియ్యపు గింజలుగా మార్చి అన్నం తయారు చేసింది. వసిష్ఠుడు సంతోషించి ఆమెను భార్యగా గ్రహించాడు.

వసిష్ఠుడు అరుంధతీ సమేతుడై ఆశ్రమవాసం చేస్తున్నాడు. అరుంధతి పతి సేవ చేస్తూ మహాసాధ్విగా పేరొంది నూరుగురు పుత్రులను కన్నది.

-సశేషం

# సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## కవిగారు - పోతునూరు

వైకుంఠపాళి ఆట మానవుని జీవితంలో నిత్యం జరిగే ఆట; పందెం వేసుకుంటూ, పావులు కదుపుకుంటూ, ఒక్కొక్కగడీ దాటుకుంటూ పైకి వెడుతుంటే, చిన్నచిన్న నిచ్చెనలు(సుఖాలు), చిన్నచిన్న పాములు (కష్టాలు)దోవలో ఎదురౌతాయి. ఎక్కడో ఒక గడిలో చాలా పెద్దనిచ్చెన ఉంటుంది. అదృష్టవశాత్తు ఆ గడి చేరితే, వాడు ఒక్కసారిగా వైకుంఠ పదవికి వెళ్ళిపోతాడు. యోగభ్రష్టులై జన్మించినవారికి అటువంటి అదృష్టం లభిస్తుంది. అది దొరకకపోయినా, నేర్పుగా పందెం వేసుకుంటూ పైకిపోతున్న కొద్దీ, పెద్ద పెద్ద నిచ్చెనులు, అలాగే పెద్ద పెద్ద పాములు తగులుతాయి. ఇలా క్రిందికి దిగుతూ, పైకి ఎక్కుతూ, ఆఖరి మెట్టుదాకా వచ్చేసరికి, అతి పెద్ద పాము కాచుకుని ఉంటుంది. దాని నోట్లో పడటమంటేనే , మృత్యువు. ఇక మళ్ళీ క్రింది వరుసలో మొదటిగడితో ఆట ప్రారంభము. అదే పునర్జన్మ. ఇలా శ్రీబాబు, ఆటపాటలలోనే గాక, నిత్య జీవితంలోని ప్రతిసన్నివేశము నుండి, ప్రతి సంఘటన నుండి అందుకోగలిగిన తత్త్వార్థాన్ని వివరిస్తూ, జీవితాన్నే ఒక మహా నాటకంగా, చదరంగంగా, గారడీ ప్రదర్శనంగా, క్రీడారంగంగా నిరంతర సాధన క్షేత్రంగా తత్త్వమయంగా దర్శించటం నేర్పారు.



నిత్యగృహ కృత్యాలలో కూడ ఎంత నేర్పుగా, పొందికగా నిండుగా మెలగాలో ఆయా సమయాలలో నేర్పేవారు. అవసరమైతే స్వయంగా చేసి చూపించి మరీ నేర్పేవారు. ఒకరోజు రాత్రి ప్రొద్దుపోయాక శ్రీ బాబు పోతునూరు రాఘవరావుగారింటికి వెళ్ళారు. వేణు వెంటనే వారింటికి వెళ్ళింది. స్నానం చేయటానికి వేడినీళ్ళు పెట్టమన్నారు శ్రీ బాబు. కట్టెల పొయ్యి మీద కాగుతో నీళ్ళు పెట్టి, మంటరావటం కోసం వేణు గొట్టంతో గాలి ఊదుతోంది. చేతగాక, కళ్ళలోకి నోట్లోకి పొగ వచ్చి ఉక్కిరిబిక్కిరైంది.

శ్రీబాబు అంతలో అటు వచ్చి చూచి నవ్వుతూ వేణుని లెమ్మని, తాము పొగ వెనక్కిరాకుండా గొట్టంతో గాలి ఎలా ఊదాలో ఊది చూపించి నేర్పారు! ఆ తర్వాత శ్రీబాబు పూజ చేసుకొని అందరికి తీర్థమిచ్చి, నివేదన చేసుకున్నారు. రాత్రి సుమారు ఒంటిగంట దాటింది. అమ్మమ్మగారు లేవలేక, వేణమ్మను దొడ్లో పనులు ముగించి తులపులువేసి రమ్మన్నారు.

దొడ్లో ఆవులకు గడ్డివేయటానికి వెళ్ళిన వేణమ్మ వెనకాలే టార్చిలైటుతో శ్రీబాబు వెళ్ళారు. గడ్డివామునుండి గడ్డి లాగటం వేణమ్మకు చేతకాలేదు. శ్రీబాబు 'ఇలా లాగాలి' అని చూపిస్తూ, గడ్డిలాగి అందించారు. కుడితి తొట్టెలో నీళ్ళుపోయటానికి, గిలకబావి గట్టుపైకెక్కి నీళ్ళుతోడవలసి వచ్చింది. "నువ్వు అలా బావిమీదికి ఎక్కడం మంచిదికాదని", పంచను పైకి ఎగగట్టి బావి గట్టుపైకెక్కి, బుంగతో నీళ్ళు తోడి, శ్రీబాబు వేణుకు నీళ్ళు అందించారు. అలనాడు అర్జునునికి విజయం సాధించి పెట్టటానికి, "గుర్రములు తోలుపనికి ఒప్పుకొన్న గీతాచార్యుడే, భక్తపరతంత్రుడైన శ్రీబాబు. సంత్ ఏకనాథ స్వామి యింట్లో శ్రీఖండ్యా అనే బాలుని రూపంలో కూరలు తరిగి, నీళ్ళ కావిళ్ళు మోసిన శ్రీకృష్ణుడే శ్రీబాబు. సక్కుబాయిని రంగని దర్శనానికై పండరీపురం పంపి, తాను సక్కుబాయి రూపంలో ఆమె అత్తగారికి, భర్తకు అన్ని సేవలూ అందించిన పండరినాథుడే శ్రీబాబు. నిజమే; తన భక్తుని కోసం, భక్త రక్షణ తత్పరుడైన భగవంతుడు చేయనిదేమున్నది? "భక్తిః సద్గురునా న కారయతి కిం? భక్తావనోద్రేకినా" అటువంటి భక్త పరతంత్రుడైన భగవంతుడే శ్రీబాబు.

వేణమ్మ నొచ్చుకుంటూ, "బాబూ! మీరు సాక్షాత్తు భగవత్స్వరూపులు. అటువంటి మీతోనే, ఈ పనులన్నీ చేయించుకున్న చేతకానిదాన్ని" అంది. శ్రీబాబు "ఒక వేళ నువ్వు చేసినా, ఆ శక్తి నీకు భగవంతుడిచ్చినదేగాని, నీ స్వంతమేమీ కాదు. ఏ మానవుడికీ తన స్వంతమంటూ ఏదీ లేదు. అంతా ఆ పరమేశ్వరునిదే. వాడొక్కడే సత్యస్వరూపుడు. సర్వశక్తిమయుడు. మానవునికి తన స్వంతమంటూ ఏదైనా ఉంటే, అది భగవంతుడే. భగవంతుడొక్కడే తన స్వంతమని నమ్మినవాడు ధన్యుడు" అన్నారు.

- సశేషం




-గత సంచిక తరువాయి

# సూరదాస్

- రమణ ప్రసాద్

సూరదాసు రాజుతో, అక్కడి పండితులతో, "మహనీయులారా! వందనములు. నా నుండి వ్యక్తమయ్యే ప్రతిభ ఏదైనా ఉంటే అది బాలకృష్ణుని వైశిష్ట్యమే. నేనొక పనిముట్టును. బుధజన సేవకుడను. భక్తజన దాసుడను." అని విన్నవించుకున్న మాటలు అతని ఆంతరంగిక వైభవాన్ని చాటుతాయి.



సూరదాసు వారి గానం వినాలని రాణిగారు తమ అభీష్టాన్ని వ్యక్తం చేసింది. రాణిగారి అంతఃపురమందిరంలో గానం చేయమని రాజుగారు ప్రార్థించారు. అంతఃపురంలో సూరదాసు గానం చేస్తుంటే, సూరదాసు అంధుడు కనుక అంతఃపుర స్త్రీలందరూ అతని ఎదుట ఆసీనులయ్యారు. శ్రీకృష్ణ వైభవాన్ని సూరదాసు వర్ణిస్తూ గానం చేస్తున్నాడు. సూరదాసు గానం చరమ స్థాయికి చేరుకుంది. సూరదాసు కృష్ణచైతన్యంలో మునకలు వేయసాగాడు. ఎడతెగని ప్రవాహంగా ఆనందాశ్రవులు అతని కనుల నుండి ధారగా వర్షిస్తున్నాయి. వాసుదేవుడు అతని దేహమంతా వ్యాపించి అతని మనస్సంతా ఆవరించాడు. అతని నేత్రాలలో నిలచిపోయాడు. అంధత్వం చర్మచక్షువులకి కాని చైతన్యవంతమైన తనకు అంధత్వం ఎక్కడిది? అంతఃపురంలోని రాణిగారు అక్కడ కూర్చుని ఉన్న స్త్రీలందరూ ఆనందంలో మునకలు వేశారు. అంతఃపుర పరిచారిక ఒక పాత్రలో పాలు తెచ్చి సూరదాసు ముందు ఉంచింది. ఆమెను గాంచి "కృష్ణా! నా కొరకు క్షీరమును తెచ్చావా? క్షీరసాగర శయనా! నీ అనుభూతిలో ఓలలాడే

నాకు క్షీరము యొక్క ఆవశ్యకత ఎక్కడిది?" అన్నాడు.

అంతఃపుర స్త్రీలు అందరూ దిగ్భ్రాంతి చెందారు. "ఏమిటి? సూరదాసు అంధుడు కాడా? ఎంత మోసం జరిగింది?" అన్నారు.

సూరదాసు మందహాసంతో "కృష్ణా! ప్రపంచంలో వెలుతురు లేదు. నీలో చీకటి ఉండదు. నిన్ను దర్శించిన వారికి అంధత్వం ఎక్కడిది? నిన్ను మరచిన వారికి అంధత్వం ఉంటుంది. అంతా కృష్ణమయమై వుండగా అజ్ఞానము ఎక్కడ ఉన్నది? అంధత్వం ఎక్కడిది?" అంటూ నేలకొరిగాడు.

అంతే! అయిపోయింది. సూరదాస్ చైతన్యం, కృష్ణ చైతన్యంలో లీనమైంది. అక్కడివారు అందరూ దిగ్భ్రాంతి చెందారు. కన్నీటితో ఆయన పాదాలను అభిషేకించారు. అతని పాదములు నడచిన బాటలో తాము అడుగులు వేయు శక్తిని, భక్తిని ప్రసాదించమని ప్రార్థించారు. ఆయన మరణం 1581లో సంభవించి ఉండవచ్చునని చెబుతారు.

సూరదాస్ విరచితమైన సూర్ సాగర్ ఒక అమృత భాండం. ఆయన చేసిన ఇతర రచనలు "సుర్-సరావళి". ఇందులో హోళీ పండగ ఆధారంగా చేసిన వంద రచనలలో శ్రీకృష్ణుని సృష్టికర్తగా, భర్తగా వర్ణించారు.

"సాహిత్య లహరి" అనే రచనలో భగవంతునిపై భక్తిని వర్ణిస్తూ గానం చేశారు.

సూరదాసు అమర రత్నంగా భాసించాడు !

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL